విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :52 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | బుధవారం 15 జూలై 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## కాపు ఉద్యమ నేత ముద్రగడ ఇకలేరు



- సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం కన్నుమూత
- కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స
- ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం తుదిశ్వాస విడిచిన నేత
- కాపు ఉద్యమ నేతగా రాష్ట్ర రాజకీయాల్లో బలమైన ముద్ర

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సీనియర్ నేత, కాపు ఉద్యమ సారథి ముద్రగడ పద్మనాభం (73) మంగళవారం కన్నుమూశారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, హైదరాబాద్‌లోని సింధు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో ఆయన

వివరాలు 2లో..

## ఏఐ ఉపయోగించండి... సైబర్ భద్రత పటిష్ఠం చేయండి




- బ్యాంకులకు ఆర్బీఐ కీలక సూచన
- ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకుల సీఈవోలతో ఆర్బీఐ గవర్నర్ సమావేశం
- ఏఐ, సైబర్ సెక్యూరిటీపై దృష్టి పెట్టాలని బ్యాంకులకు కీలక సూచన
- వినియోగదారులే కేంద్రంగా సేవలు అందించాలని దిశానిర్దేశం
- సీబీడీసీ, యూఎల్ఐ, నకిలీ నోట్ల గుర్తింపు వంటి అంశాలపై చర్చ

## హర్మూజ్ జలసంధిపై ట్రంప్ యూటర్న్

- 20 శాతం టోల్ ప్రతిపాదన వెనక్కి!
- హర్మూజ్ జలసంధిలో కార్గోపై 20 శాతం సుంకం ప్రతిపాదనను ఉపసంహరించుకున్న ట్రంప్
- సుంకానికి బదులుగా గల్ఫ్ దేశాలతో వాణిజ్య, పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకుంటామని వెల్లడి
- ఈ ఒప్పందాల వల్ల అమెరికాలో లక్షల ఉద్యోగాలు వస్తాయని ట్రంప్ ప్రకటన
- ఒక్కరోజు ముందే హర్మూజ్ భద్రతకు తాము డబ్బు వసూలు చేస్తామని ట్రంప్ ప్రకటన
- ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రాధాన్యత సంతరించుకున్న పరిణామం

# అధికారులు నాలుగు గోడలు దాటి వెళ్లాలి

- అప్పుడే ప్రజా సమస్యలు తెలుస్తాయి
- '2019--2024 మధ్య అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నం!
- ఇక నుంచి ప్రతీ నెలా... ఆర్థిక నివేదికలు విడుదల
- అర్జీల పరిష్కారం, క్షేత్ర స్థాయి పర్యటనలు తప్పనిసరి
- మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో సీఎం చంద్రబాబు



**అమరావతి**

ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలోనూ పర్యటించాలి. ప్రజల సమస్యలు, వాస్తవాలు తెలియాలంటే క్షేత్రస్థాయికి వెళ్లాల్సిందే. వినూత్న ఆలోచనలతోనే సుపరిపాలనను క్షేత్రస్థాయికి తీసుకువెళ్లాలి అని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. సచివాలయంలో మంగళవారం మంత్రులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో ఎంఈఆర్‌పై నిర్వహించిన సమావేశంలో సీఎం అధికారులకు దిశానిర్దేశం చేశారు. డేటా డ్రివెన్ గవర్నెన్సుతో రియల్ టైమ్ రిజల్ట్స్ సాధించాలి. డేటా డ్రివెన్ గవర్నెన్సు ఆధారంగా పాలనను మరింత సులభతరం చేయాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం అన్నారు. దీని కోసం దేశంలోనే మొదటిసారిగా మంత్లీ ఎకనామిక్ రిపోర్టుల ద్వారా వృద్ధిని సమీక్షించుకుంటున్నామని తెలిపారు. ఇక నుంచి ప్రతీ నెలా... నెలవారీ

వివరాలు 2లో..



## ఉక్రెయిన్‌పై అణుదాడిని ఆపిన మోదీ

- పోలండ్ మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు
- ఉక్రెయిన్‌పై అణుదాడిని ప్రధాని మోదీ నివారించారన్న పోలండ్ మంత్రి
- రష్యాతో భారత్‌కు ఉన్న సంబంధాలే ఇందుకు కారణమని వ్యాఖ్య
- మోదీ చెప్పే మాటలను పుతిన్ శ్రద్ధగా వింటారని వ్యాఖ్య
- 2022 చివర్లో అణుయుద్ధ భయాలు పెరిగిన వేళ ఈ పరిణామం

# ప్రభుత్వ నిర్లక్ష్యమే మత్స్యకారుల ప్రాణాలు బలిగొంది



- బాధిత కుటుంబాలకు రూ.1 కోటి పరిహారం ఇవ్వాలి
- బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటాం
- ప్రమాదంలో నష్టపోయిన బోటుకు బదులుగా కొత్త బోటును ప్రభుత్వం వెంటనే అందించాలని డిమాండ్
- మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి

**విశాఖపట్నం**

విశాఖ బోటు ప్రమాదంలో మత్స్యకారులు ప్రాణాలు కోల్పోవడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. ప్రాణాలు కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాలను మంగళవారం ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. బాధిత కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి చొప్పున పరిహారం, ప్రమాదంలో నష్టపోయిన బోటుకు బదులుగా కొత్త బోటును ప్రభుత్వం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు వైయస్ఆర్‌సీపీ అండగా ఉంటుందని, వారి తరఫున నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. ఘటనపట్ల కుటుంబ సభ్యులు ఫిషరీస్ శాఖ, మెరైన్ పోలీసు, జిల్లా యంత్రాంగానికి వరుసగా సమాచారం అందించినప్పటికీ, ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోలేదన్నారు. సమన్వయంతో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించి ఉంటే మరింత మంది ప్రాణాలు దక్కేవని

వివరాలు 2లో..



## వాణిజ్య నౌకలపై దాడులు ఆగిపోవాలి

- హర్మూజ్‌లో దాడులపై భారత్ సీరియస్
- పశ్చిమాసియాలో మళ్లీ ముదురుతున్న యుద్ధం
- హర్మూజ్‌లో ప్రయాణిస్తున్న యూఏఈకి చెందిన రెండు నౌకలపై ఇరాన్ దాడి
- ఈ ఘటనలో ఒక భారతీయ నావికుడు మరణం
- ఈ విషయంపై ఆందోళన వ్యక్తం చేసిన భారత్

## కోర్టునే తప్పుదోవ పట్టిస్తారా?

- ఇది అహంకారం కాకపోతే మరేంటి?"
- ఇన్‌ఫ్లూయెన్సర్లపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం
- 'దివ్యాంగులపై జోకులు, కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘనలు
- ఇది అహంకారం కాకపోతే ఇంకేంటి
- సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్స్‌పై సుప్రీంకోర్టు ఫైర్

# సర్ గడువు పొడిగింపు

- ఈనెల 24 వరకు ఇంటింటి సర్వే కార్యక్రమం
- ఓటర్ల జాబితా సవరణకు 10 రోజులు గడువు పొడిగింపు
- ఎస్ఐఆర్ కార్యక్రమానికి గడువు పొడిగించిన ఎన్నికల సంఘం
- ఈనెల 31న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ
- ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి భారత ఎన్నికల సంఘం గడువును పొడిగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి ఎన్నికల సంఘం అండర్ సెక్రటరీ సందీప్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని జులై 24 వరకు కొనసాగించనున్నారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కూడా జులై 24లోపు పూర్తి చేయాలని నిర్ణయించారు. ఓటర్ల ముసాయిదా జాబితాను జులై 31న

వివరాలు 2లో..

# వాణిజ్య నౌకలపై దాడులు ఆగిపోవాలి



హర్మూజ్ జలసంధి వంటి అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో వాణిజ్య నౌకల రాకపోకలకు ఆటంకం కలిగించడాన్ని, అందులోని సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని ఇరాన్ జరిపిన దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు నౌకలపై జరిగిన లక్షిత దాడులపై తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయానికి చెందిన డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్ (డీసీఎం) మహమ్మద్ జావాద్ హొస్సేనీను భారత విదేశాంగ శాఖ పిలిపించిన వెంటనే ఈ అధికారిక ప్రకటన వెలువడింది. కాగా, ఒమన్ తీరంలో ప్రయాణిస్తున్న యూఏఈకి చెందిన రెండు చమురు ట్యాంకర్లపై ఇరాన్ క్షిపణులతో దాడి చేయగా, ఈ ఘటనలో ఒక భారతీయ నావికుడు మృతి చెందాడు. పలువురు గాయపడ్డారు. అనంతరం భారత విదేశాంగ శాఖ కీలక ప్రకటన చేసింది.

సముద్ర మార్గాల్లో దాడులు పునర్ ప్రారంభం కావడం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడంపై భారత విదేశాంగ శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పశ్చిమాసియాలో ప్రశాంతత, భద్రత, స్థిరత్వాన్ని కాపాడేందుకు శత్రుత్వాలకు తక్షణమే ముగింపు పలకాలని పిలుపునిచ్చింది. అలాగే శాంతి కోసం చర్చలు, దౌత్యపరమైన సంప్రదింపులు జరపాలని కోరింది. అంతర్జాతీయ చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా ప్రపంచ నౌకాయాన మార్గాల్లో అడ్డంకులు లేని రాకపోకలు, సముద్ర వాణిజ్యాన్ని త్వరగా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేసింది. పశ్చిమాసియాలోని వాణిజ్య నౌకలు, సైనికేతర కేంద్రాలపై దాడులు ఆగిపోవాలని పేర్కొంది.

### 'క్షతగాత్రుల్లో ఇద్దరి పరిస్థితి విషమం'

ఒమన్ తీరంలో అల్ బాహియా, మొంబాసా అనే పేరు గల రెండు నౌకలపై జరిగిన దాడుల పట్ల భారత్ తీవ్ర ఆందోళన చెందుతోందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. ఈ రెండు నౌకల్లో మొత్తం 46 మంది సిబ్బంది ఉండగా, వారిలో 30 మంది భారతీయులేనని తెలిపారు. అల్ బాహియాలో పనిచేస్తున్న 12 మంది భారతీయులలో ఒకరు మరణించారని, మరొకరు గాయపడ్డారని పేర్కొన్నారు. మొంబాసాలో ఉన్న 18 మంది భారతీయుల్లో 9 మంది సిబ్బంది గాయపడ్డారని, వీరిలో ఇద్దరి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉందని వెల్లడించారు. అలాగే మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. గాయపడిన సిబ్బంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. "బాధిత భారతీయ నావికులకు అవసరమైన సహాయం అందేలా చూసేందుకు యూఏఈలోని ఇండియన్ ఎంబసీ, కాన్సులేట్ అక్కడి పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నాయి. యూఏఈ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయి. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న రెండు నౌకలపై జరిగిన క్షిపణి దాడిలో ఒక భారతీయ నావికుడు మరణించాడు. పలువురు గాయపడ్డారు. ఈ ఘటనపై తీవ్ర నిరసన తెలియజేయడానికి మంగళవారం ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయం డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్‌ను భారత్ పిలిపించింది. పశ్చిమాసియాలో జరుగుతున్న అన్ని పరిణామాలను మేము నిశితంగా గమనిస్తున్నాం. హర్మూజ్ జలసంధి గుండా సురక్షితమైన, స్వేచ్ఛాయుతమైన నౌకాయానానికి, వాణిజ్యానికి మద్దతుగా మేము మా వైఖరిని స్థిరంగా కొనసాగిస్తున్నాం. ఎందుకంటే హర్మూజ్‌లో నౌకాయానం భారత్‌లోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ఆర్థిక, ఇంధన భద్రతను కల్పించడంలో సహాయపడుతుంది" అని భారత విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు.

### అక్కడి పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం : యూఏఈలోని ఇండియన్ ఎంబసీ

హర్మూజ్‌లో వాణిజ్య నౌకలపై జరిగిన దాడిలో భారతీయ నావికుడు మరణించడంపై యూఏఈలోని ఇండియన్ ఎంబసీ స్పందించింది. భారతీయ నావికుడి మృతికి సంతాపం తెలిపింది. అక్కడి పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొంది. "అల్ బహియా, మొంబాసా అనే రెండు నౌకలపై జరిగిన దాడుల్లో ఒక భారతీయ నావికుడు విషాదకరంగా మరణించడం పట్ల మేము సంతాపం తెలియజేస్తున్నాం. అక్కడి పరిస్థితిని మేము నిశితంగా గమనిస్తున్నాం. గాయపడిన వారికి, వారి కుటుంబాలకు అండగా ఉండడానికి స్థానిక అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం" అని యూఏఈలోని ఇండియన్ ఎంబసీ ఎక్స్‌లో పోస్ట్ పెట్టింది.

### ఇరాన్‌పై యూఏఈ ఫైర్

మరోవైపు, హర్మూజ్‌లో తమ దేశ నౌకలపై దాడుల జరగడంపై యూఏఈ తీవ్రంగా మండిపడింది. ఈ దాడులను అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘనగా పేర్కొంది. దేశ భద్రత, జాతీయ ప్రయోజనాల పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకునే హక్కు తమకు ఉందని తెలిపింది. పరిస్థితిని ఎదుర్కొనేందుకు భద్రతా వ్యవస్థలను అప్రమత్తం చేసినట్లు ప్రకటించింది. ఇరాన్ వెంటనే ఇలాంటి రెచ్చగొట్టే దాడులను నిలిపివేయాలని, అన్ని రకాల ఘర్షణలను షరతులు లేకుండా విరమించాలని, హర్మూజ్‌ను పూర్తిగా తెరవాలని కోరింది. ప్రపంచ వాణిజ్యం, ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం కోసం ఇది అత్యవసరమని అభిప్రాయపడింది.

# "కోర్టునే తప్పుదోవ పట్టిస్తారా?



దివ్యాంగులపై జోకులు వేసి, కోర్టు ఉత్తర్వులను సైతం ఉల్లంఘించిన హాస్య నటుడు సమయ్? రైనా, యూట్యూబర్లు రణవీర్ అల్హాబాదియా, ఆశీష్? చంచలానీలపై సుప్రీంకోర్టు మంగళవారం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వీరంతా తమకు తాముగా 'యూత్ ఐకాన్లు'గా ప్రకటించుకున్నారని వ్యాఖ్యానించింది. సమయ్ రైనా, రణ్‌వీర్ అల్హాబాదియాతోపాటు మరికొందరు కమెడియన్లు దివ్యాంగులపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఎస్?ఎంఏ క్యూర్ ఫౌండేషన్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీనితో గతంలో విచారణ చేసిన న్యాయస్థానం, దివ్యాంగులకు గౌరవ, మర్యాదలు ఇవ్వాలని, వారి విజయాల గురించి ఈ కమెడియన్స్? తమ షోలలో చెప్పాలని ఆదేశించింది. అంతేకాదు తమ షోలకు దివ్యాంగులను కూడా ఆహ్వానించి, వచ్చిన నిధులను బాధితుల చికిత్సకు అందజేయాలని ఆదేశించింది. తాజాగా చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహన్‌లతో కూడిన త్రిసభ్య ధర్మాసనం దీనిపై మరోసారి విచారణ చేపట్టింది. సమయ్ రైనా తన షోకి వికలాంగులను ఆహ్వానించకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

"సమయ్ రైనా కోర్టును తప్పుదోవ పట్టించాడంలో మాకు ఎలాంటి సందేహం లేదు. ఈ కోర్టు ముందు ఇచ్చిన ఉత్తర్వులను అతడు పూర్తిగా బరితెగించి ఉల్లంఘించాడు. నిన్న కంప్లయన్స్? అఫిడవిట్? దాఖలు చేశామని పేర్కొన్నాడు. కానీ అతను ఎలాంటి అఫిడవిట్ దాఖలు చేయలేదు. ఇది తీవ్రమైన దుష్ప్రవర్తన. దేశం వెలుపల ఉండడం వల్ల తాము న్యాయవ్యవస్థ పరిధికి అతీతులమని వారు భావిస్తున్నారు. ఇది అహంకారం కాకపోతే మరేంటి? ఒకవేళ ఇది అహంకారం కాకపోతే, మనం ఆక్స్?ఫర్డ్ డిక్షనరీని కూడా మార్చాలి ఉంటుంది" అని సీజేఐ సూర్యకాంత్? ఆగ్రహం వ్యక్తం చేశారు. తరువాత సమయ్? రైనాకు రూ.10 లక్షల జరిమానా విధించారు. తరువాత అతని న్యాయవాది అభ్యర్థనతో దానిని రూ.3 లక్షలకు తగ్గించారు. మరోసారి తప్పు చేస్తే ఈ మొత్తాన్ని రూ.30 లక్షలకు పెంచుతామని హెచ్చరించారు. జరిమానాను 2 వారాల్లోగా సుప్రీంకోర్టుకు జమ చేయాలని సీజేఐ ఆదేశించారు.

### ఇంతకీ ఏం జరిగింది?

"స్పైనల్ మస్కులర్ అట్రోఫీ (ఎస్?ఎంఏ) వ్యాధి చికిత్సకు అయ్యే అధిక ఖర్చుపై సమయ్ రైనా అనుచిత వ్యాఖ్యలు చేశారు. అక్కడితో ఆగకుండా ఆ వైకల్యం ఉన్న ఒక వ్యక్తిని ఎగతాళి చేశాడు" అని క్యూర్ ఎస్ఎంఏ ఇండియా ఫౌండేషన్ సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ వేసింది. 'ఇండియాస్ గాట్ లేటెంట్' హోస్ట్‌గా ఉన్న సమయ్ రైనాతోపాటు ఇతర సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు విపున్ గోయల్, బాల్‌రాజ్ పరమ్‌జీత్ సింగ్ ఘాయ్, సోనాలీ థక్కర్, నిశాంత్ జగదీశ్ తన్వర్ దివ్యాంగులపై వేసిన అసభ్యకరమైన, అనుచితమైన జోకులు గురించి తెలిపింది. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా సదరు సంస్థ తరఫున హాజరైన సీనియర్ అడ్వకేట్ అపరాజితా సింగ్, సమయ్ రైనా తను నిర్వహించిన షోలకు దివ్యాంగులనుకానీ, తమను కానీ ఆహ్వానించలేదని చెప్పారు. దీనితో సుప్రీంకోర్టు సదరు ఇన్‌ఫ్లూయెన్సర్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

వికలాంగుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు కఠిన చట్టం అవసరమని సుప్రీంకోర్టు నొక్కి చెప్పింది ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలోనే దివ్యాంగులను, అరుదైన జన్యుపరమైన రుగ్మతలతో బాధపడేవారిని అవమానంచేలా లేదా ఎగతాళి చేసేలా వ్యాఖ్యలు చేయడాన్ని శిక్షార్హమైన నేరంగా పరిగణించాలని పేర్కొంది. ఇందుకోసం ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని గురువారం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. అంతేకాదు భవిష్యత్తులో తమ ప్రవర్తన పట్ల జాగ్రత్తగ ఉండాలని ఇన్?ఫ్లూయెన్సర్లను హెచ్చరిస్తూ, దివ్యాంగుల విజయగాథనలపై నెలకు రెండు కార్యక్రమాలు లేదా షోలు నిర్వహించాలని సమయ్ రైనాను, ఇతరులను ధర్మాసనం ఆదేశించింది. కానీ వారు అలా చేయకపోవడంతో తాజాగా సుప్రీంకోర్టు వారిపై ఆగ్రహం వ్యక్తం చూస్తూ, జరిమానా విధించింది.

# 3 ఏళ్ల ఫీజు వాపసు ఇచ్చేయండి

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల పెంపుపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు గత నాలుగేళ్ల ఫీజు రికార్డులను పది రోజుల్లోగా సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే, గత మూడేళ్లుగా రాష్ట్రంలో ఏటా 5 శాతానికి పైగా ఫీజులు పెంచిన ప్రైవేట్ పాఠశాలలు, ఆ అదనపు మొత్తాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు తిరిగి చెల్లించాలని పేర్కొన్నారు. ఇకపై ఫీజు రికార్డులకు సంబంధించిన సమాచారం విద్యాశాఖ పోర్టల్‌లో ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. ఇకపై ప్రైవేట్ పాఠశాలలు వార్షిక ఫీజులను 5శాతానికి మించి పెంచకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు సీఎం. ఒకవేళ ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత పాఠశాలలపై రూ.50వేల నుంచి రూ.1 లక్షవరకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అలాగే, ఆ పాఠశాల గుర్తింపును కూడా రద్దు చేస్తామన్నారు. ఈ మేరకు కొత్త ఆర్డినెన్స్? జారీ చేశారు. అయితే, ఈ నిర్ణయం ద్వారా పంజాబ్‌లోని దాదాపు 32లక్షలకు పైగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రయోజనం పొందుతారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా, ఈ ఆర్డినెన్స్ అమలుతో, పంజాబ్‌లోని ప్రైవేట్ పాఠశాలలు వార్షిక ఫీజులను 5 శాతానికి మించి పెంచలేవని సీఎం భగవంత్? మాన్ తెలిపారు. ఒకవేళ ఏదైనా పాఠశాల దీనికంటే ఎక్కువగా ఫీజులను పెంచాలనుకుంటే, సంబంధిత అధికారి నుంచి ముందస్తు అనుమతి తీసుకోవడం తప్పనిసరి చెప్పారు. అలాగే, గత ప్రభుత్వాలు అనవసరమైన ఫీజులు విధించడానికి ప్రైవేట్ విద్యా సంస్థలను అనుమతించాయని, దీనివల్ల విద్యా వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లిందని ఆయన ఆరోపించారు. అయితే, విద్యా సంస్థలు, వివిధ ఖాతాల ద్వారా ఫీజులు వసూలు చేసి, విద్య పేరుతో లాభాలు ఆర్జించకూడదని తెలిపారు. మరోవైపు, ఈ ఆర్డినెన్స్?కు ఆమోదం తెలిపిన గవర్నర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. "పంజాబ్ విద్యార్థుల తల్లిదండ్రులకు అనుకూలమైన ప్రయోజనాలను చేకూర్చడానికి మేం తీసుకున్న ఈ నిర్ణయానికి ఆమోద ముద్ర వేసినందుకు గవర్నర్ సాహెబ్‌కు హృదయపూర్వక ధన్యవాదాలు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల దోపిడీని అరికట్టడానికి ప్రభుత్వం తీసుకువచ్చిన 'పంజాబ్ రెగ్యులేషన్ ఆఫ్ ఫీజు ఆఫ్ అన్‌ఎయిడెడ్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ (సవరణ) ఆర్డినెన్స్ 2026'పై ఆయన సంతకం చేశారు.

## హర్మూజ్ జలసంధిపై ట్రంప్ యూటర్న్



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హర్మూజ్ జలసంధి మీదుగా రవాణా అయ్యే సరుకులపై 20 శాతం సుంకం (టోల్) విధించాలన్న తన ప్రతిపాదనను ఆయన విరమించుకున్నారు. ఈ సుంకానికి బదులుగా గల్ఫ్ దేశాలతో భారీస్థాయిలో వాణిజ్య, పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రతిపాదించిన కేవలం 24 గంటల వ్యవధిలోనే ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకోవడం గమనార్హం. మంగళవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వివరాలను వెల్లడించారు. "మధ్యప్రాచ్య దేశాల నేతలతో జరిపిన ఫలవంతమైన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందాలను భారీ డీల్స్‌గా అభివర్ణించిన ఆయన, ఇవి ఇరుపక్షాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా అమెరికాలో మరిన్ని కర్మాగారాలు, తయారీ ప్లాంట్లు ఏర్పాటవుతాయని, తద్వారా అధిక వేతనాలతో కూడిన లక్షలాది ఉద్యోగాలు సృష్టించబడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నిజానికి సోమవారం నాడే ట్రంప్ ఈ సుంకం విధింపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. హర్మూజ్ జలసంధికి అమెరికా సంరక్షకుడిగా వ్యవహరిస్తుందని, ఈ కీలక మార్గంలో భద్రత కల్పించేందుకు అయ్యే వ్యయాన్ని తిరిగి రాబట్టేందుకే ఈ సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతల నెలకొన్న నేపథ్యంలో, ప్రపంచ చమురు రవాణాలో ఐదో వంతు వాటా కలిగిన ఈ జలసంధి భద్రత కోసం ఇటువంటి చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ సుంకం ప్రతిపాదనపై గల్ఫ్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. దీనివల్ల అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన విపణిపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆయా దేశాలు భావించాయి. మరోవైపు, ఈ జలసంధిపై అమెరికా ఆధిపత్యాన్ని సహించేది లేదని ఇరాన్ హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తన నిర్ణయాన్ని సమీక్షించుకుని, సుంకం విధింపు కంటే ఆర్థిక దౌత్యానికే మొగ్గు చూపారు.

## ఏఐ ఉపయోగించండి... సైబర్ భద్రత పటిష్ఠం చేయండి

బ్యాంకింగ్ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగాన్ని పెంచాలని, సైబర్ భద్రతను పటిష్ఠం చేసుకోవాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా బ్యాంకులకు పిలుపునిచ్చారు. వినియోగదారులకే పెద్దపీట వేయాలని అన్నారు. మంగళవారం ముంబైలో ప్రభుత్వ రంగ మరియు ఎంపిక చేసిన ప్రైవేట్ రంగ బ్యాంకుల మేనేజింగ్ డైరెక్టర్లు, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లతో ఆర్బీఐ నిర్వహించిన అర్ధవార్షిక సమావేశంలో ఆయన ఈ కీలక సూచనలు చేశారు. ఈ సమావేశానికి ఆర్బీఐ గవర్నర్‌తో పాటు డిప్యూటీ గవర్నర్లు స్వామినాథన్ జె., డా. పూనమ్ గుప్తా, ఎస్. సి. ముర్ము, రోహిత్ జైన్‌లతో పాటు పలువురు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, భారత బ్యాంకింగ్ రంగం అన్ని విభాగాల్లోనూ విస్తృతమైన వృద్ధిని సాధించిందని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో, ఆర్థిక వ్యవస్థలోని అన్ని రంగాలకు వివేకంతో కూడిన మద్దతును కొనసాగించాలని ఆయన బ్యాంకులను కోరారు. బ్యాంకింగ్‌లో టెక్నాలజీ పాత్ర పెరుగుతున్న నేపథ్యంలో, ఏఐ వంటి అధునాతన సాంకేతికతలను అందిపుచ్చుకోవాలని గవర్నర్ సూచించారు. దీని ద్వారా సేవలను విస్తరించవచ్చని, నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చని, ఖర్చులను తగ్గించుకోవచ్చని ఆయన వివరించారు. అదే సమయంలో, సైబర్ దాడుల నుంచి రక్షణకు బలమైన వ్యవస్థలు, పటిష్ఠమైన అంతర్గత నియంత్రణలు తప్పనిసరి అని నొక్కి చెప్పారు. కస్టమర్ల డేటా దుర్వినియోగం కాకుండా, మోసాల బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సెంట్రల్ కేవైసీ రికార్డ్స్ రిజిస్ట్రీ (జఙజ=), నకిలీ కరెన్సీ నోట్ల గుర్తింపు, మ్యూల్ హంటర్ కార్యక్రమం, సెంట్రల్ బ్యాంక్ డిజిటల్ కరెన్సీ (జదీణజ), యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (ఖూ×), అకౌంట్ అగ్రిగేటర్ ఫ్రేమ్‌వర్క్ వంటి పలు కీలక అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమాలపై బ్యాంకుల ప్రతినిధులు తమ అభిప్రాయాలను, ఫీడ్‌బ్యాక్‌ను ఆర్బీఐకి అందించారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని వారు పునరుద్ఘాటించారు.

## ఉక్రెయిన్‌పై అణుదాడిని ఆపిన మోదీ



ఉక్రెయిన్-రష్యా యుద్ధంలో అణ్వస్త్రాల ప్రయోగం జరగకుండా నివారించడంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ కీలక పాత్ర పోషించారని పోలండ్ డిప్యూటీ విదేశాంగ మంత్రి వ్లాడిస్లావ్ టియోఫిల్ బార్టోస్జెస్కీ ప్రశంసించారు. 2022 చివరి నాటికి ఉక్రెయిన్‌పై అణుదాడికి రష్యా సిద్ధమవుతోందన్న ఆందోళనలు వ్యక్తమైన తరుణంలో, ప్రధాని మోదీ జోక్యం చేసుకుని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఒప్పించగలిగారని ఆయన వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "ప్రధాని మోదీ అంతర్జాతీయ స్థాయిలో విశేష గౌరవం పొందిన గొప్ప రాజనీతిజ్ఞుడు. భారత్‌కు రష్యాతో చారిత్రక, సుదీర్ఘ సంబంధాలు ఉన్నాయి. అందుకే మోదీ మాటలను పుతిన్ అత్యంత శ్రద్ధతో వింటారు" అని పేర్కొన్నారు. రష్యాపై ప్రభావం చూపగలిగే అతికొద్ది మంది ప్రపంచ నేతల్లో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో పాటు మోదీ కూడా ఒకరని బార్టోస్జెస్కీ వివరించారు. 2022 ద్వితీయార్ధంలో ఉక్రెయిన్ యుద్ధం తీవ్ర రూపం దాల్చినప్పుడు, రష్యా అణ్వస్త్రాలను ప్రయోగించవచ్చన్న భయాందోళనలు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్నాయి. అయితే అప్పట్లో పెను ప్రమాదం తప్పడం వెనుక మోదీ దౌత్యం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మొదట్లో రష్యా నుంచి భారత్ రాయితీపై చమురు కొనుగోలు చేయడాన్ని పోలండ్ విమర్శించినప్పటికీ, ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడ్డాయని, ఒకరి ఆర్థిక, వ్యూహాత్మక అవసరాలను మరొకరు గౌరవిస్తున్నామని ఆయన తెలిపారు. ఉక్రెయిన్ సంక్షోభం విషయంలో భారత్ మొదటి నుంచి తటస్థ వైఖరిని అనుసరిస్తోంది. కేవలం దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించుకోవాలని సూచిస్తోంది. అటు రష్యాతో ఆర్థిక సంబంధాలను కొనసాగిస్తూనే, ఇటు శాంతి స్థాపన కోసం పిలుపునిస్తోంది. ఈ క్రమంలో, ఉక్రెయిన్‌కు అండగా నిలుస్తున్న నాటో సభ్యదేశం పోలండ్ నుంచి మోదీ పాత్రపై ఈ స్థాయిలో ప్రశంసలు రావడం అంతర్జాతీయంగా భారత్ దౌత్య ప్రాముఖ్యతను చాటుతోంది.

# 18 ఏళ్ల పిల్లాడికి ఏం తెలుస్తుంది? జగన్ షాకింగ్ కామెంట్స్.

- యాక్సిడెంట్ చేసి మనిషిని చంపాడని
- హత్య కేసు నమోదు చేస్తారా?.
- యాక్సిడెంట్స్ అన్నాక జరుగుతాయి, అందుకని 18 ఏళ్ల పిల్లాడి పై కేసులా.
- సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ అరెస్టు పై జగన్ స్పందన.



**విశాఖపట్నం, పెన్ సత్తా, జూలై 14:**మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడు ఆరవ్ వర్మ అరెస్టు పై మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి స్పందన హాట్ టాపిక్ అవుతోంది. రోడ్డు ప్రమాదం చేసిన ఆరవ్ వర్మను తాను సమర్థించడం లేదని, కానీ అతడి పై హత్య కేసు నమోదు చేస్తారా?
అంటూ ఆక్షేపించారు. అయితే 18 ఏళ్ల పిల్లాడు రోడ్డు ప్రమాదం చేశాడు?, అతడికి ఏం తెలుస్తుందంటూ జగన్ రెడ్డి చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో రచ్చకు తెరలేపాయి. 18 ఏళ్ల పిల్లాడు నిర్లక్ష్యంగా వాహనం నడిపి ఒకరి మరణానికి కారణ మైతే చర్యలు తీసుకోకుండా వదిలేయాలా? అంటూ నెటిజన్లు ప్రశ్నలతో దండెత్తుతున్నారు.
రోడ్డు ప్రమాదం చేసిన సీదిరి కుమారుడిని తాను సమర్థించడం లేదంటూ జగన్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే అతని వయసు 18 ఏళ్లు. యాక్సిడెంట్స్ అన్నాక జరుగుతాయి, అందుకని 18 ఏళ్ల పిల్లాడు మీద మర్డర్ కేసు పెడతారా? అంటూ జగన్ ఫైర్ అయ్యారు. మర్డర్ కేసు పెట్టడం ఏంటి? అని జడ్జ్ తీవ్రంగా మందలిస్తే పోలీసులు సెక్షన్లు మార్చారని మాజీ సీఎం జగన్ రెడ్డి ప్రభుత్వ తీరు పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, రోడ్డు ప్రమాదం పై జగన్ రెడ్డి స్పందన సోషల్ మీడియాలో విస్తృత చర్చకు దారితీస్తోంది. నిజానికి రోడ్డు ప్రమాదం ఎవరు చేసినా కేసులు నమోదు చేయడం సాధారణమేనని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. నిందితుడు వైసీపీకి చెందిన మాజీ మంత్రి కుమారుడు అయినంత మాత్రాన కేసు పెట్టకుండా వదిలేయాలా? అంటూ ప్రశ్నిస్తున్నారు. సహజంగా ప్రమాదశాత్తూ జరిగే ఇటువంటి ఘటనలకు స్టేషన్ బెయిలు మంజూరు చేస్తుంటారు. అయితే మాజీ మంత్రి సీదిరి తన కుమారుడిని పోలీసు కేసు నుంచి తప్పించు కోవాలని ప్రయత్నించడం, ఆ విషయాన్ని పత్రికలు, అధికార పార్టీ నేతలు బయటపెట్టడంతో వివాదాస్పద మైందని చెబుతున్నారు. ఈ విషయం పై మాజీ సీఎం జగన్ రెడ్డి స్పందించడమే ఆశ్చర్యానికి గురిచేస్తోందని సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు. జగన్ రెడ్డి మాట్లాడిన వీడియో పై వందల సంఖ్యలో నెగిటివ్ కామెంట్లు చేస్తున్నారు. తప్పు చేస్తే మీ వాడని వదిలేయాలా? అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఎల్ఎల్ఆర్ లైసెన్సు తీసుకున్న యువకుడు ఒక్కడు బండి నడపడం తప్పని, ఆ సమయంలో వెనక అనుభవం ఉన్న వారు ఉండాలని, అదే సమయంలో బండి పై ఎల్ బోర్డు ఉంచాలని నిబంధనలు ఉన్న విషయాన్ని చెబుతున్నారు. మాజీ మంత్రి కుమారుడి విషయంలో ఇవేవీ పాటించక పోవడం తోనే అరెస్టు చేసి రిమాండ్ కు పంపారని పోలీసులు చెబుతున్నారు. మొత్తానికి ఈ వ్యవహారం వైసీపీ అధినేత జగన్ రెడ్డి స్పందించి ట్రోలింగ్ కు గురవుతున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# సింగపూర్ జూ తరహాలో జూపార్కును అభివృద్ధి చేసేందుకు సంపూర్ణ సహకారం












- అవసర మైన నిధులు, మౌలిక వసతులు, సిబ్బంది అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తాం.
- ఏపీ శాసనసభ వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణ కమిటీ ఛైర్మన్, స్పీకర్ అయ్యన్న పాత్రుడు.

**విశాఖపట్నం, పెన్ సత్తా, జూలై 14:** విశాఖపట్నం లోని ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలను అంతర్జాతీయ ప్రమాణాలతో, సింగపూర్ మందాయ్ జూ పార్కు తరహాలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని సహాయ, సహకారాలు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ శాసనసభ వన్యప్రాణి, పర్యావరణ పరి రక్షణ కమిటీ ఛైర్మన్, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు పేర్కొన్నారు. జూ అభివృద్ధికి అవసర మైన నిధులు, మౌలిక వసతులు, సిబ్బంది, జంతు సంరక్షణ తదితర అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మంగళవారం కమిటీ సభ్యులతో కలిసి ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలను సందర్శించిన స్పీకర్, జూలోని వివిధ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జూ క్యురేటర్ డాక్టర్ మంగమ్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జూ అభివృద్ధి, జంతు సంరక్షణ, ఏనుగుల నిర్వహణ, సందర్శకులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమగ్ర వివరాలను కమిటీకి వివరించారు. జూ చరిత్ర, విస్తీర్ణం, జంతు సంపద గురించి వివరిస్తూ 1972లో జూ స్థాపనకు అనుమతి లభించగా, 1977లో ప్రజలకు అందుబాటు లోకి వచ్చిందని తెలిపారు. 625 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈ జూలో ప్రస్తుతం 108 జాతులకు చెందిన 1,404 జంతువులు సంరక్షణ పొందుతున్నాయని వెల్లడించారు. జూలో 81 ఎన్క్లోజర్లు ఉండగా, 81 మంది సిబ్బంది సేవలందిస్తున్నారని తెలిపారు. జూలో ఉన్న సరస్వతి, రాజు, కృష్ణ, లక్ష్మి పేర్లతో పిలిచే నాలుగు ఏనుగుల దినచర్య, ఆహారం, ఆరోగ్య సంరక్షణ, శిక్షణ, వ్యాయామం, వైద్య పర్యవేక్షణ తదితర అంశాలపై ప్రత్యేక ప్రజెంటేషన్ నిర్వహించారు. జంతువులకు శాస్త్రీయ పద్ధతుల్లో ఆహార పంపిణీ, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు, ప్రత్యేక వైద్య సేవలు, సమ్మర్ మేనేజ్మెంట్ కార్యక్రమాలు, ఎనిమల్ ఎన్రిచ్మెంట్ ప్రక్రియ, ప్రత్యేక ఎన్క్లోజర్ల ఏర్పాటు వంటి చర్యలను అమలు చేస్తున్నట్లు క్యురేటర్ తెలిపారు. 2025–26 సంవత్సరంలో నాలుగు జూలతో జంతు మార్పిడి కార్యక్రమాలు చేపట్టామని, అస్సాం జూ నుంచి బ్లాక్ పాంథర్ను తీసుకువచ్చామన్నారు. విశాఖ జూలో అనేక జంతువుల సంతానోత్పత్తి విజయవంతంగా కొనసాగుతోందని, ఇది జూ నిర్వహణలో ఉన్న నాణ్యతకు నిదర్శనమని వివరించారు. సీఎస్సార్ నిధుల సహాయంతో ఇప్పటికే 8 కొత్త ఎన్క్లోజర్లు నిర్మించి, పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. జంతువులను దత్తత తీసుకునే కార్యక్రమానికి దాతల నుంచి విశేష స్పందన లభించిందని తెలిపారు. 'వన్ డే -- వన్ స్కూల్' కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తూ విద్యార్థులకు జంతు సంరక్షణ, జీవ వైవిధ్యం, పర్యావరణ పరి రక్షణ అంశాలపై జూ వైద్యాధికారి, ఇతర నిపుణుల ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

జూ అభివృద్ధిపై స్పీకర్ సూచనలు:

ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్న పాత్రుడు ప్రస్తుతం ఉన్న బడ్జెట్ లోటును భర్తీ చేయడంతో పాటు ఆదాయానికి, నిర్వహణ ఖర్చులకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి ఏడాది సీఎస్ఆర్ నిధుల ద్వారా కనీసం రూ.3 కోట్లను జంతు సంరక్షణకు సమీకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉత్తరాంధ్ర ఎంపీలు తమ ఎంపీ ల్యాడ్స్ నిధుల్లో 10 శాతం జూ అభివృద్ధికి కేటాయించే అంశాన్ని పరిశీలించాలని అభిప్రాయపడ్డారు. జూలో ఖాళీగా ఉన్న పోస్టులను అత్యవసరంగా భర్తీ చేయాలని, ఆర్థిక వనరులు సమకూరే ఆదాయ వృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టాలని సూచించారు. సందర్శకులను ఆకర్షించే వినోద కార్యక్రమాలతో పాటు అత్యున్నత ప్రమాణాలతో కూడిన క్యాంటీన్, మరిన్ని మౌలిక వసతులు, రోజువారీ సందర్శకుల అవసరాలకు అనుగుణమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. తిరుపతి వంటి సంస్థల నుంచి కూడా జంతు సంరక్షణ, జూల నిర్వహణకు ఆర్థిక సహాయం అందే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. తాను అటవీశాఖ మంత్రిగా ఉన్న సమయంలో కంబాలకొండను వైల్డ్లైఫ్ శాంక్చువరీగా ప్రకటించడం వల్ల ఆక్రమణలను సమర్థవంతంగా అరికట్టగలిగామని స్పీకర్ గుర్తు చేశారు. జూ సందర్శన అనంతరం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, కమిటీ సభ్యులు జూ ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు తెలిపారు.

ఏనిమల్ రెస్క్యూ సెంటర్ సందర్శన, వాచ్ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన.

కమిటీ సభ్యులు కంబాలకొండ ఏనిమల్ రెస్క్యూ సెంటర్ను సందర్శించి అక్కడ చేపడుతున్న జంతు సంరక్షణ చర్యలను పరిశీలించారు. కేంద్రంలో సందర్శకుల భద్రత, నిర్వహణను మరింత మెరుగుపర్చేందుకు అదనపు వాచ్టవర్, అదనపు పగోడా నిర్మాణానికి స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కమిటీ సభ్యులు శంకుస్థాపన చేశారు. 2002లో ఆయన అటవీశాఖ మంత్రిగా ఉన్నప్పుడు రెస్క్యూ సెంటర్ వద్ద వేసిన శిలాఫలకం దగ్గర అయ్యన్నపాత్రుడు కమిటీ సభ్యులతో కలిసి బృంద చిత్రం దిగారు.
ఈ పర్యటనలో కమిటీ సభ్యులు పాలవలస విక్రాంత్(ఎమ్మెల్సీ), బి. తిరుమల నాయుడు(ఎమ్మెల్సీ), ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, గోండు శంకర రావు, చింతమనేని ప్రభాకర్, వేగేశన నరేంద్ర వర్మ రాజు, అసెంబ్లీ సెక్రటరీ ప్రసన్న కుమార్ సూర్యదేవర, అటవీశాఖ ఉన్నతాధికారులు కాశీ విశ్వనాథ రాజు, చలపతిరావు, జూ క్యురేటర్ మంగమ్మ, జిల్లా ఫారెస్ట్ అధికారి రవీందర్ దామా, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పొడిగింపు.

జూలై 24 వరకు ఇంటింటి సర్వే..
అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రచురణ.
ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ను వెల్లడించిన జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్.



**విశాఖపట్నం, పెన్ సత్తా, జూలై 14:**ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ను విడుదల చేసిందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో బీఎల్వోలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యక్రమం జూలై 24 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కూడా జూలై 24 లోపు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం జూలై 31 న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ జరుగుతుందని, అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్ల నుంచి క్లెయిమ్లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని చెప్పారు. అనంతరం వాటి విచారణ, పరిష్కార ప్రక్రియను సెప్టెంబర్ 28 వరకు పూర్తి చేసి, అక్టోబర్ 3 న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వివరించారు. ముందు షెడ్యూల్ ప్రకారం అయితే సెప్టంబర్ 22 న తుది జాబితా ప్రచురణ జరగాల్సి ఉందని గుర్తు చేశారు.
జిల్లాలో ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన సవరించిన షెడ్యూల్ ప్రకారం వేగవంతంగా పూర్తి చేయడానికి అన్ని ఎన్నికల అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లినప్పుడు ఓటర్లు పూర్తి సహకారం అందించి అవసరమైన వివరాలు, పత్రాలను సమర్పించాలని కోరారు. అదేవిధంగా రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సవరించిన షెడ్యూల్ను గమనించి ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# అమరావతి ఛాంపియన్షిప్ పోస్టర్ను ఆవిష్కరించిన కేతన్ గార్గ్.




**విశాఖపట్నం, పెన్ సత్తా, జూలై 14**: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న అమరావతి ఛాంపియన్షిప్--2026 ప్రచార కార్యక్రమంలో భాగంగా మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం లోని ఆయన ఛాంబర్ లో ఛాంపియన్షిప్ పోస్టరు ను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జూన్ గాలియట్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నిర్వహిస్తుందని తెలిపారు. అమరావతి ఛాంపియన్ షిప్--2026 యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని, ఈ పోటీల్లో విశాఖపట్నం జిల్లాకు చెందిన క్రీడాకారులు అధిక సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటు కోవాలన్నారు. జూలై 15, 2026 నుంచి ఆగస్టు 26, 2026 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల పరిధిలో 12 క్రీడాంశాల్లో ఈ ఛాంపియన్షిప్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.
ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఇంచార్జ్ స్పోర్ట్స్ డైరెక్టర్ ఇ. ఎ. అప్పలరాజు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ గడువు పొడిగింపు.

- జూలై 24 వరకు ఇంటింటి సర్వే..
- అక్టోబర్ 3 న తుది ఓటరు జాబితా ప్రచురణ.
- కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ను వెల్లడించిన జిల్లా కలెక్టర్.




**అనకాపల్లి, పెన్ సత్తా, జూలై 14**: ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ-2026 (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం సవరించిన షెడ్యూల్ను విడుదల చేసిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి విజయ క్రిష్ణన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో బీఎల్వోలు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే కార్యక్రమం జూలై 24 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.
అదే విధంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ, పునర్వ్యవస్థీకరణ ప్రక్రియను కూడా జూలై 24 లోపు పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ జరుగుతుందని, అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు ఓటర్ల నుంచి క్లెయిమ్లు, అభ్యంతరాలు స్వీకరిస్తారని చెప్పారు. అనంతరం వాటి విచారణ, పరిష్కార ప్రక్రియను సెప్టెంబర్ 28 వరకు పూర్తి చేసి, అక్టోబర్ 3న తుది ఓటరు జాబితా ప్రచురించనున్నట్లు వివరించారు.
జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ -2026 (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన సవరించిన షెడ్యూల్ ప్రకారం వేగవంతంగా పూర్తి చేయడానికి ఎన్నికల అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. బీఎల్వోలు ఇంటింటికి వెళ్లినప్పుడు ఓటర్లు పూర్తి సహకారం అందించి అవసర మైన వివరాలు, పత్రాలను సమర్పించాలని కోరారు. ?కావున, ప్రజలందరూ, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ సవరించిన షెడ్యూల్ ను గమనించి, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు లేదా కొత్త ఓటరు నమోదు కొరకు నిర్దేశిత గడువు లోగా తమ దరఖాస్తులను సమర్పించి ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## రథయాత్ర మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి.





**అనకాపల్లి, పెన్ సత్తా, జులై 14**: గవరపాలెం అగ్గిమర్రిచెట్టు వద్ద కొలువైన సుభద్రా, బలభద్ర సమేత జగన్నాథ్ స్వామివారి రథయాత్ర మహోత్సవానికి
ఏర్పాట్లు పూర్తి. దేవస్థానంలో దేవాదాయ ధర్మదాయ శాఖ సహకారంతో, మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఈనెల 16 తారీకు నుండి 25 తారీకు వరకు స్వామి రథయాత్ర మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి, ఆలయ ఈవో కే చంద్ర తేజ తెలియజేశారు. ఆలయ ప్రాంగణంలో ప్రముఖ కాంట్రాక్టర్ కొణతాల శ్రీనివాసరావు సుమారు ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహకారంతో సిమెంట్ ఫ్లోరింగ్ చేసి తిరుపతి మాడ వీధుల వలె వివిధ రకాల ముగ్గులను ముగ్గులను వేశారు. ఈ నెల 15 బుధవారం రాత్రి ఆలయ మండపంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి కళ్యాణం జరుగుతుందని వారు తెలియజేశారు. గురువారం ఉదయం ఆలయ వద్ద నుండి జగన్నాథ స్వామి ప్రత్యేక పూజలు చేసి రథయాత్ర ప్రారంభమవుతుందని, ఈ రథయాత్రలో స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొని రథయాత్ర ప్రారంభిస్తారని వారు తెలియజేశారు. రథయాత్ర గవరపాలెం ఆలయం వద్ద నుండి బయలుదేరి పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు గా గూడ్స్ రోడ్డు వద్ద ఉన్న ఇంద్రజుమ్మహాలుకు చేరుకుంటుంది. పది రోజులు పాటు స్వామివారు దశావతారముల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. సాయంత్రం వేళ ధార్మికప్రవచనాలు, భక్తి సంగీతం, కోలాటకలు, అన్నమయ్య కీర్తనలు, జానపద కోలాటం, కార్యక్రమాలు ఉంటాయని వారు తెలియజేశారు. 25 తేదీన శనివారం తిరుగురథయాత్ర సందర్భముగా ఇంద్రజుమ్మ హాలు వద్ద భారీ అన్న సమారాధన నిర్వహిస్తామని వారు తెలియజేశారు.

## జగన్ మోహన్ రెడ్డి కి స్వాగతం పలికిన పయిల



**పరవాడ, పెన్ సత్తా, జులై 14:**ఇటీవల చేపలవేట కు వెళ్లి గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలని పరామర్శించి, వారికి ధైర్యం చెప్పడానికి విశాఖపట్నం విచ్చేసిన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి కి విమానాశ్రయం వద్ద మర్యాద పూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గం పరిశీలకులు పయిల శ్రీనివాసరావు. ఈ సందర్భంగా వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి తో సర్ జరుగుతున్న తీరు, పార్టీ సంస్థాగత కమిటీల, వెరిఫికేషన్ ప్రక్రియ విజయవంతంగా జరుగుతున్నట్లు తెలియచేయడం జరిగింది. ఈ సందర్భంగా జగన్ పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనాలని, పేద నిరుపేద కుటుంబాలకు పార్టీ అండగా ఉండాలని చూచిండం జరిగింది. ఈ కార్యక్రమంలో పయిల సాయి అప్పల నాయుడు, గండి రవి కుమార్, బండారు శ్రీనివాసరావు లు పాల్గొన్నారు.

## జూలై 18న ప్రత్యేక లోక్ ఆదాలత్

సీనియర్ సివిల్ జడ్జ్ వెంకటేశ్వర్లు



**ధర్మవరం,జూలై 14 (పెన్ సత్తా)** పట్టణంలోని ధర్మవరం కోర్టులో జూలై 18వ తేదీన ప్రత్యేక లోక్ అదాలకు నిర్వహిస్తున్నట్లు
సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు,ప్రిన్సిపుల్ జూనియర్ సివిల్ జడ్జి నందిని,
అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జ్ వెంకట హరీష్ తెలిపారు.ఈ సందర్భంగా కోర్టులో న్యాయవాదులతో సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు చాంబర్లో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ,ప్రత్యేక లోక్ అదాలత్ లో ఎన్ఐ యాక్ట్ కు సంబంధించిన చెక్ బౌన్స్ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవచ్చని తెలిపారు.ముఖ్యంగా జూలై 18వతేదిన నిర్వహించే స్పెషల్ లోక్ అదాలత్ లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కరించుకోవాలని తెలిపారు.ఈ సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సీనియర్,జూనియర్ న్యాయవాదులు,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# మత్స్యకారుల కన్నీళ్లతో రాజకీయాలు మానాలి జగన్ రెడ్డి.



- అధికారంలో చేసిన అన్యాయాలకు ముందుగా సమాధానం చెప్పాలి.
- మత్స్యకారులను మోసం చేసింది గొడ్డలి పార్టీ.
- అండగా నిలిచింది చంద్రబాబు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వం.
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు.

**విశాఖపట్నం, పెన్ సత్తా, జూలై 14:** విశాఖలో బోటు ప్రమాద బాధిత మత్స్యకార కుటుంబాలను పరామర్శించిన మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి సానుభూతి రాజకీయాలు చేసే ముందు తన ఐదేళ్ల పాలనలో మత్స్యకారులకు చేసిన అన్యాయాలకు సమాధానం చెప్పాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం పల్లా విశాఖపట్నంలో స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, చైర్మన్, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఇతర నాయకులతో కలిపి పత్రికా సమావేశంలో మాట్లాడారు. అధికారంలో ఉన్నప్పుడు మత్స్యకారుల కన్నీళు కనిపించని జగన్ రెడ్డి ఇప్పుడు పరామర్శల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నించడం కపట రాజకీయాలకు పరాకాష్ట అని విమర్శించారు. మత్స్యకారుల హక్కులను కాలరాసిన వ్యక్తి కి, వారి బాధల పై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బాధిత కుటుంబాలను పట్టించు కోని జగన్ రెడ్డి ప్రతిపక్షం లోకి వచ్చిన తర్వాత శవ రాజకీయాలకు తెరలేపడం ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నమేనని మండి పడ్డారు.

మత్స్యకారుల హక్కులను హరించిన జగన్‌కు పరామర్శించే అర్హత లేదు.

మత్స్యకారుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన జగన్ రెడ్డి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని బాధిత కుటుంబాలను పరామర్శించడానికి వచ్చారని పల్లా ప్రశ్నించారు. సముద్రంలో ప్రాణాలు కోల్పోయిన మత్స్యకారుల కుటుంబాలకు న్యాయం చేయకుండా, పరిహారం ఇవ్వకుండా, సంక్షేమ పథకాలను నిలిపివేసి ఇప్పుడు కపట సానుభూతి ప్రదర్శించడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తామని గొప్పలు చెప్పుకున్న వైసీపీ ప్రభుత్వం, తొలి రెండేళ్లలో వచ్చిన 116 క్లెయిమ్ లలో 52 క్లెయిమ్ లను బడ్జెట్ లేదు అనే సాకుతో ఏళ్ల తరబడి పెండింగ్‌లో పెట్టిందని విమర్శించారు. ఐదేళ్లలో వందలాది మంది మత్స్యకారులు ప్రాణాలు కోల్పోయినా, ఎంత మందికి పూర్తి పరిహారం ఇచ్చారో చెప్పే ధైర్యం జగన్ రెడ్డి కి ఉందా అని ప్రశ్నించారు. సముద్రంలో ప్రమాదాలకు గురై మరణించిన మత్స్యకారుల సంఖ్య పై కనీసం ఒక అధికారిక శ్వేతపత్రం కూడా విడుదల చేయలేదన్నారు. ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో రిప్ కరెంట్లు, పాత బోట్లు, భద్రతా లోపాల వల్ల ఏటా ప్రాణాలు కోల్పోతున్నా ఆ వివరాలు బయటకు వస్తే ప్రభుత్వ వైఫల్యం బట్టబయలు అవుతుందనే భయంతో అధికారిక సమాచారాన్నే దాచిపెట్టారని ఆరోపించారు. గత ప్రభుత్వం మత్స్యకారులకు కనీసం ఒక వల కూడా ఇవ్వలేదని, జీవో నెం.30 తీసుకొచ్చి రైతు భరోసా లేదా వాహనమిత్ర పొందుతున్న కుటుంబాలకు మత్స్యకార భరోసా ఇవ్వకుండా వేలాది కుటుంబాలను ఇబ్బందులకు గురిచేసిందని విమర్శించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించింది చంద్రబాబు ప్రభుత్వం.

ఇటీవల జరిగిన బోటు ప్రమాదంలో మత్స్యకారులు గల్లంతయ్యారన్న సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు అధికారులు, కోస్ట్‌గార్డ్, నేవీ, సంబంధిత శాఖలు యుద్ధప్రాతిపదికన రంగం లోకి దిగాయని పల్లా తెలిపారు. గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం ఇప్పటికీ నిరంతర గాలింపు కొనసాగుతోందన్నారు. ప్రమాదం జరిగిన 72 గంటల్లోపే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆరు కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం మంజూరు చేశారని తెలిపారు. ఇందులో రూ.5 లక్షలు మత్స్యశాఖ నుంచి, మరో రూ.5 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విడుదల చేశారని చెప్పారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన కారి చిన్న కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలుస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు.

ముందుగా తెలిసింది వైసీపీ నేతలకే, అయినా పోర్టుకు సమాచారం ఎందుకు ఇవ్వలేదు?. బోటు ప్రమాదం పై మరో కీలక అంశాన్ని పల్లా ప్రస్తావించారు. ప్రమాద సమాచారం ముందుగా వైసీపీ నాయకులకు ఎలా తెలిసిందని ప్రశ్నించారు. జానకి రామ్ కు ప్రమాద సమాచారం ఎప్పుడు తెలిసింది?, బాధిత కుటుంబాల ఆధార్ కార్డులు, ఫొటోలు సేకరించి అదే రాత్రి మీడియాకు విడుదల చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ప్రమాదం గురించి ముందుగానే సమాచారం తెలిసి కూడా గంగవరం పోర్టు అధికారులకు ఎందుకు తెలియజేయలేదని నిలదీశారు. చివరకు బోటు ఆపరేటర్ల సంఘం అధ్యక్షుడు లక్ష్మణరావు సమాచారం ఇవ్వడం తోనే పోర్టు యంత్రాంగం అప్రమత్త మై సహాయక చర్యలు వేగవంతం చేశారని పేర్కొన్నారు. మత్స్యకారుల కన్నీళ్ల పై రాజకీయాలు చేయొద్దు. జగన్ రెడ్డి విశాఖ పర్యటనలో కోస్ట్‌గార్డ్, నేవీ చర్యలను ప్రశ్నించడం అత్యంత బాధ్యతారాహిత్యమని పల్లా శ్రీనివాసరావు మండి పడ్డారు. దేశ భద్రత కోసం అహర్నిశలు సేవలందిస్తున్న కోస్ట్‌గార్డ్, భారత నౌకాదళం వంటి అత్యున్నత సంస్థలను రాజకీయాల కోసం విమర్శించడం సమంజసం కాదన్నారు. గల్లంతైన మత్స్యకారుల కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టి గాలింపు చర్యలు కొనసాగిస్తున్న జవాన్ల మనోధైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడడం దేశ రక్షణ దళాలను అవమానించడమేనని అన్నారు. గంగవరం పోర్టుకు సుమారు 10 నాటికల్ మైళ్ల దూరంలో ప్రమాదం జరిగినప్పటికీ, సంబంధిత అధికారులకు సమాచారం ఆలస్యంగా చేరిందని చెప్పారు. సమాచారం అందిన వెంటనే కోస్ట్‌గార్డ్, నేవీ, పోర్టు అధికారులు సమన్వయంతో విస్తృత స్థాయిలో గాలింపు చేపట్టారని గుర్తు చేశారు. అలాంటి సమయంలో వారి పై విమర్శలు చేయడం దురదృష్టకరమన్నారు. ఒక కోటి ప్రకటన వెనుక మానవత్వమా... ఓట్ల రాజకీయమా?. మత్స్యకారుల పై నిజంగా ప్రేమ ఉంటే అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఎందుకు చూపలేదని పల్లా ప్రశ్నించారు. నాడు ప్రమాదాలు జరిగినప్పుడు కనీసం పార్టీ తరపున లక్ష రూపాయలు కూడా ప్రకటించని జగన్ రెడ్డి... ఇప్పుడు ఒక్కసారిగా రూ.1 కోటి ప్రకటించడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటని నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు బాధిత కుటుంబాలకు న్యాయం చేయకుండా, పరిహారం ఇవ్వకుండా, డెత్ సర్టిఫికెట్లు కూడా అందకుండా చేసిన ప్రభుత్వం, ఇప్పుడు కోట్లు ప్రకటిస్తే ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఇది మానవత్వం కాదని, రాజకీయ స్వలాభం కోసం చేస్తున్న ప్రచారమని విమర్శించారు.

తప్పుడు ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు. హోంమంత్రి వంగలపూడి అనిత, మత్స్యశాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించలేదని, నాయకులు అందుబాటులో లేరని వైసీపీ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని పల్లా స్పష్టం చేశారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే వీడియో కాల్ ద్వారా బాధిత కుటుంబాలతో మాట్లాడి పరామర్శించారని తెలిపారు. సంబంధిత అధికారులతో నిరంతరం మాట్లాడి పరిస్థితిని సమీక్షించారని చెప్పారు. ముందుగా స్పందించింది ముఖ్యమంత్రి కార్యాలయమేనని, సీఎం కార్యాలయం నుంచే కోస్ట్‌గార్డ్, నేవీ, జిల్లా యంత్రాంగానికి సమాచారం వెళ్లి సహాయక చర్యలు వేగవంత మయ్యాయని పేర్కొన్నారు. ఫిషింగ్ హార్బర్ అగ్నిప్రమాదంలో కనిపించని జగన్ ఇప్పుడు పరామర్శల డ్రామా.

విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో 45 బోట్లు అగ్నికి ఆహుతై వందలాది కుటుంబాలు తీవ్రంగా నష్టపోయినప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న జగన్ రెడ్డి ఒక్కసారి కూడా బాధితులను పరామర్శించలేదని పల్లా గుర్తు చేశారు. అధికారంలో వున్నప్పుడు బాధితుల కన్నీళ్లు తుడవని వ్యక్తి, ఇప్పుడు మత్స్యకారుల పై కపట ప్రేమ చూపించడం ప్రజలను మోసం చేయడమేనన్నారు.

మత్స్యకారుల ఆస్తుల పై కన్నేసిన వైసీపీ:
వైసీపీ పాలనలో మత్స్యకారుల హక్కులే కాదు, వారి ఆస్తుల పైనా కన్నేశారని పల్లా ఆరోపించారు. విశాఖపట్నం పెదజాలారిపేట లోని 20.27 ఎకరాల విలువైన మత్స్యకారుల భూములను భూ సేకరణ పేరుతో స్వాధీనం చేసుకునేందుకు అప్పటి ప్రభుత్వం ప్రయత్నించిందన్నారు. సుమారు రూ.2,500 కోట్ల విలువైన ఆ భూ ములను కోల్పోయే పరిస్థితి తీసుకొచ్చిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత ఆ ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసి మత్స్యకారుల హక్కులను కాపాడిందని తెలిపారు.

సీదిరి అప్పలరాజు కొడుకు ఘటన పై ముందుగా సమాధానం చెప్పాలి.

మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుమారుడి ప్రమాద ఘటనలో బాధితులకు న్యాయం చేయకుండా కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారని పల్లా ఆరోపించారు. మొదట వేరే వారి పై కేసులు పెట్టి, తర్వాత సీసీటీవీ దృశ్యాలు బయటకు రావడంతో నిజాలు వెలుగు లోకి వచ్చాయని అన్నారు. నేడు పరామర్శల పేరుతో రాజకీయాలు చేసే ముందు ఆ బాధిత కుటుంబాలను ఎందుకు పరామర్శించలేదో జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

గత ప్రభుత్వం ఆపేసిన బకాయిలన్నీ చెల్లించింది కూటమి ప్రభుత్వమే.

మత్స్యకారుల సంక్షేమాన్ని మాటల్లో కాకుండా చేతల్లో నిరూపిస్తున్న ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వమని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యానికి గురిచేసి పెండింగ్‌లో పెట్టిన 63 ఎక్స్‌గ్రేషియా క్లెయిమ్‌లను కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే పరిష్కరించి, రూ.3.15 కోట్లను నేరుగా బాధిత కుటుంబాల ఖాతాల్లో జమ చేసిందన్నారు. అదే విధంగా వైసీపీ ప్రభుత్వం విడుదల చేయకుండా నిలిపివేసిన రూ.9.90 కోట్ల డీజిల్ సబ్సిడీ బకాయిలను కూడా కూటమి ప్రభుత్వం చెల్లించి, 20,812 మత్స్య పడవలకు ప్రత్యక్ష లబ్ధి చేకూర్చిందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పెండింగ్‌లు పేరుకుపోయేలా చేసిన వైసీపీకి, అధికారం లోకి వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించిన కూటమికి మధ్య ఉన్న తేడా ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందన్నారు.

జీవో-217 తో జాలర్ల పొట్టకొట్టింది వైసీపీ ప్రభుత్వం:
వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెం.217 మత్స్యకారుల జీవనోపాధిని దెబ్బతీసిన నిర్ణయంగా చరిత్రలో నిలిచిపోతుందని పల్లా విమర్శించారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మత్స్యకార సహకార సంఘాలకు కేటాయించిన చెరువులు, రిజర్వాయర్లను ఆన్‌లైన్ వేలాల పేరుతో పార్టీ అనుచరులు, దళారులకు అప్పగించి వేలాది మంది మత్స్యకారుల జీవనాధారాన్ని దెబ్బతీశారన్నారు. ఉచిత చేప పిల్లల పంపిణీని నిలిపివేయడంతో కులవృత్తి తీవ్రంగా దెబ్బతిందని, అనేక కుటుంబాలు ఉపాధి కోసం వలసబాట పట్టాల్సి వచ్చిందన్నారు. మత్స్యకారులను వారి సొంత గ్రామాల్లోనే కూలీలుగా మార్చిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనని తీవ్రంగా విమర్శించారు. వైసీపీ పాలనలో ప్రమాదాల్లో మరణించిన మత్స్యకారుల కుటుంబాలు ఐదేళ్ల పాటు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరిగినా కనీసం డెత్ సర్టిఫికెట్లు కూడా ఇవ్వలేదని పల్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. డెత్ సర్టిఫికెట్లు లేక ఎక్స్‌గ్రేషియా ఇవ్వని జగన్ రెడ్డి, ఇప్పుడు బాధిత కుటుంబాల పై ప్రేమ నటించడం ప్రజలను అవమానించడమేనని విమర్శించారు. మత్స్యకారుల సంక్షేమంలో కొత్త అధ్యాయం రాస్తున్న కూటమి ప్రభుత్వం.

మత్స్యకారుల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుందని పల్లా తెలిపారు. మెకనైజ్డ్, మోటరైజ్డ్ పడవలకు లీటరుకు రూ.9 చొప్పున డీజిల్ సబ్సిడీ అందిస్తున్నామని చెప్పారు. మెకనైజ్డ్ పడవలకు నెలకు 3,000 లీటర్లు, మోటరైజ్డ్ పడవలకు 300 లీటర్ల వరకు సబ్సిడీ వర్తిస్తోందన్నారు. 2026-27 బడ్జెట్‌లో 21,935 పడవలకు డీజిల్ సబ్సిడీ కోసం రూ.50 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రూ.3,256 కోట్లతో 9 ఫిషింగ్ హార్బర్లు, రూ.157 కోట్లతో 8 ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పిఎంఎమ్స్వై) కింద 4,560 ట్రాన్స్‌పాండర్లను అందించి సముద్రంలో మత్స్యకారుల భద్రత, సమాచార వ్యవస్థను బలోపేతం చేశామని చెప్పారు. 2025-26లో 816 పడవలు, వలలను పంపిణీ చేయడంతో పాటు, మరణించిన మత్స్యకార కుటుంబాలకు ఇప్పటివరకు దాదాపు రూ.9 కోట్ల ఎక్స్‌గ్రేషియా అందించామని తెలిపారు.

విద్యుత్ సబ్సిడీ విషయంలో జోన్--నాన్‌జోన్ పేరుతో వేలాది మంది మత్స్యకారులకు జగన్ ప్రభుత్వం అన్యాయం చేసిందని పల్లా ఆరోపించారు. 2018-19లో 52,946 మందికి విద్యుత్ సబ్సిడీ అందగా, వైసీపీ పాలనలో అది 47,091 కనెక్షన్లకు పడిపోయిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వివక్షను పూర్తిగా తొలగించి నిలిచిపోయిన 54,033 సబ్సిడీ విద్యుత్ కనెక్షన్లను పునరుద్ధరించిందని, అదనంగా 12,500 కొత్త సబ్సిడీ కనెక్షన్లు మంజూరు చేసి మొత్తం 62,181 సబ్సిడీ విద్యుత్ కనెక్షన్లను అందుబాటులోకి తీసుకువచ్చిందన్నారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.1,150 కోట్ల సబ్సిడీ భారం భరిస్తోందని చెప్పారు.

మత్స్యకారుల సేవలో కూటమి ప్రభుత్వం... రెండేళ్లలో రూ.505 కోట్లకు పైగా ఆర్థిక సాయం. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వెంటనే మత్స్యకారుల సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని 2025 ఏప్రిల్ 26న రూ.258.36 కోట్లతో 1,29,178 మంది మత్స్యకారులకు ఒక్కొక్కరికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందించిందని పల్లా తెలిపారు. గతంలో వేట నిషేధ కాలంలో ఇచ్చే సాయాన్ని భారీగా పెంచి రూ.20 వేలకు చేర్చడం మత్స్యకారుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. 2026-27 సంవత్సరానికి సంబంధించి 1,34,298 మత్స్యకార కుటుంబాలకు వేట నిషేధ కాల భృతి అందిస్తున్నామని, మే 19న రూ.286 కోట్లను నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తున్నామని తెలిపారు. రెండో విడతలో 1,30,796 కుటుంబాలకు రూ.262 కోట్ల సాయం అందిస్తున్నామని చెప్పారు. గత ఏడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్లు, ఈ ఏడాది అంతకంటే అధికంగా నిధులు కేటాయించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. రెండేళ్ల లోనే మత్స్యకార కుటుంబాలకు రూ.505 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందించి కూటమి ప్రభుత్వం తన మాటను చేతల్లో నిరూపించిందన్నారు. అదనంగా 5,910 మంది మత్స్యకారులకు రూ.11.82 కోట్ల వేట నిషేధ భృతి మంజూరు చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకుందని తెలిపారు.

మత్స్యకారుల కన్నీళ్ల పై రాజకీయాలు చేయడం మానుకుని, గతంలో చేసిన అన్యాయాలకు ముందుగా జగన్ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మాటల్లో కాదు... చేతల్లోనే మత్స్యకారుల సంక్షేమాన్ని నిరూపిస్తున్న ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని కూటమి ప్రభుత్వమని, మత్స్యకారుల ప్రాణాలు, హక్కులు, జీవనోపాధి, సంక్షేమ పరి రక్షణలో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

# ప్రజల అంచనాలకు తగ్గట్టుగా అభివృద్ధి పరుగులు పంచకర్ల







**95 వ వార్డులో సిసి రోడ్లు, కల్వర్టులు, పార్కుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన.**

**పెందుర్తి, పెన్ సత్తా, జులై 14**: నియోజకవర్గం, పెందుర్తి మండలం పరిధి లోని జీవీఎంసీ 95 వ వార్డు లక్ష్మీపురం దుర్గా నగర్, శేషాద్రి నగర్, భవాని నగర్, ఎన్ ఏ డి లేఅవుట్, చీమలపల్లి ప్రాంతాలలో జీవీఎంసీ నిధులు 93 లక్షలతో చేపట్టనున్న సిమెంట్ రోడ్లు, కాలువలు నిర్మాణం, పార్కు అభివృద్ధి పనులకు జనసేన విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు శంకుస్థాపనలు చేశారు. ముందుగా ఆయా ప్రాంతాలలో మొక్కలు నాటి పర్యావరణ పరి రక్షణకు గల ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. స్థానిక మహిళలతో మాట్లాడి వారి సాధక బాదకాలు తెలుసుకున్నారు. వార్డు పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పై ఆరా తీసిన ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఇంకా చేయాల్సిన పనులు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అవసర మైన అభివృద్ధి పనులను కూటమి నాయకులు దాట్ల మధు, కంచిపాటి మధు ద్వారా తన దృష్టికి తీసుకొస్తే 20 రోజుల్లోనే ఆయా పనులను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ ప్రజల అంచనాలకు మించి రాష్ట్రంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని రమేష్ బాబు పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి తక్షణం అభివృద్ధి చేయించడం ఎన్ డి ఏ కూటమి ప్రభుత్వానికే సాధ్యమని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు మించి అభివృద్ధి పనులు చేస్తున్నట్లు వెల్లడించారు. 95 వ వార్డులో 93 లక్షలతో చేపట్టిన రోడ్లు, కాలువలు నిర్మాణం, పార్కు అభివృద్ధి పనులు అతి త్వరలో ప్రారంభమవుతాయని, అలాగే ఇంకా మిగిలి ఉంటే వాటికి కూడా నిధులు మంజూరు చేయించి వెంటనే పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను పరుగులు పెట్టించగలిగే అధికారులు ఇక్కడ పనిచేస్తుండటం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని, అలాగే ఎమ్మెల్యేగా తాను చెప్పిన ప్రతి పనిని తూచా తప్పకుండా చేపడుతుండటం ఆనందంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో అక్కడక్కడ మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. పెందుర్తి నియోజకవర్గం, జీవీఎంసీ పరిధిలో ఇప్పటివరకు దాదాపు 500 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ప్రజల అంచనాలకు మించి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్న కూటమికి ప్రజలు మద్దతు ఇవ్వాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రమేష్ బాబు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి జోన్ జోనల్ కమిషనర్ శంకర్రావు, జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దిలీప్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పార్వతి, వార్డు అధ్యక్షులు కంచిపాటి మధు, వార్డు సీనియర్ నాయకులు దాట్ల మధు, పెందుర్తి పిఎసిఎస్ చైర్మన్ అయిత సింహాచలం, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ మెంబర్స్ నీటిపల్లి మహేష్, పెందుర్తి మాజీ ఏఎంసీ చైర్మన్ వేగి దివాకర్, వార్డు అధ్యక్షులు సేనాపతి సోమశేఖర్, పిన్నింటి పార్వతి, పెందుర్తి ఏఎంసి డైరెక్టర్ లక్కీ గోవింద్, హైమావతి, కోరుబిల్లి సంతోష్, పెందుర్తి సిహెచ్సి మెంబర్ వరూధిని, సీనియర్ నాయకులు రాపర్తి కృష్ణమోహన్, ముక్కా గోపి, స్టీల్ ప్లాంట్ రాజు, అయిత శ్రీనివాస్, రాపర్తి కిషోర్, కోనా మోహన్ కుమార్ నాయుడు, సదరం భీమేశ్వర రావు, తనకాల శ్రీనివాస రావు, కర్రి శివ, అంబటి వెంకటేశ్వర రావు, కోరుకొండ వరహాలు, కాలనీ అసోసియేషన్ పెద్దలు దాట్ల రమేష్, దాట్ల చంద్ర రాజు, లలిత, నాగేంద్ర, రమణ, నారాయణ, ప్రసాద్ రావు, పాపారావు తదితర కాలనీ పెద్దలు, పెందుర్తి నియోజకవర్గం ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు శంఖస్థాపన కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సోషల్ మీడియా,కొన్ని దినపత్రికలలో వైరల్ అవుతున్న విషయం అసత్యం

**వన్ టౌన్ సీఐ రెడ్డప్ప, టూ టౌన్ సీఐ జయ నాయక్,టూ టౌన్ ఎస్ఐ వీరేష్ వెల్లడి**



**ధర్మవరం జూలై 14 (పెన్ సత్తా)** ఇటీవల కొన్ని దినపత్రికల్లో,సోషల్ మీడియాలో వచ్చిన వార్తలు అవాస్తవమని తెలుపుతూ,వాస్తవ విషయాలను వన్ టౌన్ సీఐ రెడ్డప్ప,టూ టౌన్ సీఐ జయ నాయక్, టూ టౌన్ ఎస్ఐ వీరేష్ విలేకరుల సమావేశంలో తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ,వాస్తవ వివరాలను తెలియజేస్తూ జూలై 15 తేదీన కేతిరెడ్డి కాలనీలో గంజాయి మత్తులో కొందరు యువకులు రోడ్డుపై వీరంగం సృష్టించి ఒకరిపై ఒకరి దాడి చేసుకున్నారన్న వార్త అవాస్తవమని వారు స్పష్టం చేశారు. కానీ ఆ ఇందిరమ్మ కాలనీలో రోడ్డు పక్కన ఉన్న సిమెంటు ఇటుకల బట్టి వద్ద హరీష్, సురేష్,శర్మాస్ వలి, మహేష్,మహబూబ్ బాషా అనే వ్యక్తులు మద్యం మత్తులో ఇటుకల బట్టి యజమాని రియావుద్దీన్ తో గొడవపడి దాడి చేసినట్లు ఫిర్యాదు అందడం జరిగిందని తెలిపారు.ఫిర్యాదు మేరకు అప్పటికే కేసు నమోదు చేయడం జరిగిందని, నిందితులను విచారించగా వారు వైన్ షాపులో మద్యం సేవించి,అనంతరం ఫ్యాదిండి దగ్గర దుకాణంలో కళ్ళు తాగి, మద్యం మత్తులో గొడవకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించినట్లు తెలిపారు.ఈ వాస్తవాలు సీసీ కెమెరా ఫుటేజ్ ద్వారా నిర్ధారణ అయింది అని తెలిపారు.అనంతరం డ్రగ్ టెస్ట్ కిట్లతో నిందితులందరికీ పరీక్షలు నిర్వహించగా అందరికీ గంజాయి వినియోగం నెగిటివ్ గా వచ్చిందని తెలిపారు. అంతే కాకుండా పట్టణ ప్రజలకు వారు తెలియజేస్తూ ఎక్కడైనా గంజాయి అమ్ముతున్న, వినియోగిస్తున్న ఎడల పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్లు 100 లేదా 112 లేదా 1972 లేదా 6305800429 నెంబర్లకు ఫోన్ చేసి సహకరించాలని తెలిపారు.

# రోటరీ క్లబ్,ఆత్మీయత ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్లు



**అధ్యక్షులు జయసింహ, శెట్టిపీ జయ చంద్రారెడ్డి**

**ధర్మవరం,జూలై 14 (పెన్ సత్తా)** రోటరీ క్లబ్,ఆత్మీయ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ధర్మవరం సంయుక్తంగా రెవెన్యూ డివిజన్ పరిధిలోని చెన్నె కొత్తపల్లి మండలం జడ్పీ ఉన్నత పాఠశాలలో జూలై 19వ తేదీ ఆదివారం ఉదయం ఏడు గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహ,ఆత్మీయ ట్రస్ట్ శెట్టిపి రామిరెడ్డి, శెట్టిపి జయ చంద్రారెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా ఉచిత కంటి శిబిరం యొక్క కరపత్రాలను ధర్మవరం పట్టణంలోని సాంస్కృతిక మండలి లో కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ,చెన్నె కొత్తపల్లి మండలం వెంకటం పల్లి గ్రామానికి చెందిన కీర్తిశేషుల జర్రీ పోతుల వెంకటరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యుల దాతృత్వంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ శిబిరం రోటరీ క్లబ్,ఆత్మీయ ట్రస్టు,శంకర కంటి ఆసుపత్రి బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణ సంస్థ వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కావున చెన్నె కొత్తపల్లి మండలము చుట్టుపక్కల గల గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కంటి ఆరోగ్యమును కాపాడుకోవాలని తెలిపారు.ఈ శిబిరంలో ఉచిత కంటి వైద్య చికిత్సలతో పాటు ఉచిత రవాణా,ఉచిత వసతి,ఉచిత కంటి ఆపరేషన్లు,ఉచితంగా కంటి అద్దాలు కూడా ఇవ్వబడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సోలిగాళ్ళ వెంకటేశు, నరేంద్ర రెడ్డి,ఆత్మీయ ట్రస్ట్ ప్రతినిధులు
హీ దయతుల్లా శ్రీనివాస్ రెడ్డి,రోటరీ క్లబ్ సెక్రటరీ చంద్రశేఖర్,ట్రెజరర్ పెద్దారెడ్డి,యుటిఎఫ్ నాయకులు రామకృష్ణ నాయక్,అమర్ నారాయణరెడ్డి,మేరీ వరకుమారి,నాగేంద్రమ్మ,జింక హరికృష్ణ, రామాంజనేయులు, రాంప్రసాద్,బిల్లే రామాంజనేయులు, పూజారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి అంటే కాంక్రీట్ భవనాలు రన్ వే కాదు, ప్రజల ఆరోగ్యం రైతులు గౌరవం ముఖ్యం.

సామాజిక కార్యకర్త పండి. కాళీబాబు.



**పెన్ సత్తా, జులై 14** అభివృద్ధి అనేది ప్రజల కోసం ఉండాలి తప్ప ప్రజలనే పక్కన పెట్టే వ్యవహారం కాకూడదు అని సామాజిక కార్యకర్త పండి.కాళీ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్దానం పేరు వినగానే ప్రపంచానికి తెలిసేది విమానాశ్రయం కాదు"కిడ్నీ వ్యాధులతో కన్నీళ్లు పెట్టుకున్న వేలాది కుటుంబాలు"అని ఉద్దాన ప్రాంతంలో విమానాశ్రయం అవసరం లేదని ఎవరూ చెప్పడం లేదు,కానీ దాని ప్రాధాన్యత ఏమిటి, ఎంతవరకు?అనే ప్రశ్నకు సమాధానం కావాలి. విమానాశ్రయం అభివృద్ధికి ఒక సూచికే కావచ్చు,కానీ ప్రజల ఆరోగ్యం జీవనోపాధి కంటే ఏ మౌలిక సదుపాయం పెద్దదేమి కాదు.విమానాశ్రయం నిర్మిస్తే అభివృద్ధి వస్తుందని చెబుతున్న ప్రభుత్వం, అభివృద్ధి అంటే "కాంక్రీట్ భవనాలు,రన్ వే"మాత్రమే కాదు ప్రజల ఆరోగ్యం,రైతుల గౌరవం,యువతకుఉపాధి,నాణ్యమైన విద్య- వైద్యం,త్రాగు నీరు ఇదే నిజమైన అభివృద్ధికి పునాదులు. ఉద్దానం ప్రాంతంలో ఇప్పటికీ చాలా గ్రామాల్లో చాలామంది కిడ్నీవ్యాధితో జీవన పోరాటంచేస్తున్నారు.రైతులు పంటలకి గిట్టుబాటు ధర లేక అప్పులు పాలవుతున్నారు, స్థానికంగా ఉపాధి లేక వలసలు పోతున్నారు.చాలా గ్రామాల్లో త్రాగునీరు వైద్యం ఇంకా పూర్తి స్థాయిలో అందుబాటులోనే లేవు.ప్రభుత్వం మొదట ప్రజల ఆరోగ్య భద్రతకు బలమైన పునాది వేసి తరువాత విమానాశ్రయాలు కట్టినా ప్రజలు మరింత సంతోషిస్తారని కాళీబాబు పేర్కొన్నారు.

# పొలం పిలుస్తుంది కార్యక్రమం నారుమడులు పర్యవేక్షణ



**పెన్ సత్తా, జులై 14** యలమంచిలి మండలంలోని వ్యవసాయ శాఖ వారు ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడినటువంటి పొలం పిలుస్తుంది కార్యక్రమం ఖరీఫ్ 2026వ సంవత్సరంలో రైతులకు చేదోడు వాదోడుగా రైతుల పొలాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమం ఈరోజు ఏటికొప్పాక ,బయ్యవరం గ్రామాలలో వ్యవసాయ శాఖ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమం ఉద్దేశించి మండల వ్యవసాయ అధికారి మోహనరావు మాట్లాడుతూ రైతు సోదరులందరూ ఈ సంవత్సరం వాతావరణ పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని తక్కువ మధ్యస్థ మరియు ఎక్కువ పంటకాల పరిమితి రకాలైనటువంటి విత్తనాలు అన్ని రకాల వరి విత్తనములు వ్యవసాయ శాఖ మరియు రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉన్నాయని, రైతు సోదరులను నారుమడుల విషయాలలో మేలుకవులు పాటిస్తే నారు సమృద్ధిగా పెరిగి ఎటువంటి చీడపీడలు నారుమడులలో లేకుండా గమనించినట్లయితే ప్రధాన వరి పొలంలో ఒక చదరపు మీటరుకు 33 మొక్కలు ఉండేలాగా సరిచూసుకోవాలని ఆ విధంగా వేసుకున్నట్లయితే అధిక దిగుబడులు సాధించడానికి అవకాశం ఉంటుందని అలాగే ఎరువుల విషయంలో ముఖ్యంగా యూరియా కొరత లేదని రైతు సేవా కేంద్రాలతో పాటుగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లక్కవరం మరియు డీలర్ల వద్ద 124 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని ,రైతు సోదరులు తమరు యొక్క ఆధార్ నెంబర్ ను ఉపయోగించి ఏపీ ఎఐఎంఎస్ యాప్ ద్వారా ఎరువులు వినియోగించుకొని తద్వారా సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు యూరియా విషయంలో ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే మండల వ్యవసాయ అధికారి వారిని 8331056391 సంప్రదించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో రైతులు సూర్యారావు పెంటయ్య నానాజీ తో పాటుగా ఆగ్రాజచీఫ్ స్టాఫ్,గ్రామ సహాయకులు మధు మరియు కుమార్ పాల్గొన్నారు.

# రావణ్ విషయంలో నేతల యూ టర్న్

**విజయవాడ :** ఏపీలో ఆసక్తి రేకెత్తించిన జోసెఫ్ రావణ్ అలియాస్ ప్రశ్న రావణ్ వ్యవహారంపై కొత్త కొత్త విషయాలు బయటకు వస్తున్నాయి. జనసేన అదినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై అసభ్య పదజాలాన్ని ప్రయోగించిన కేసులో అరెస్టు అయిన రావణ్ కు న్యాయ సహాయం చేసిన ప్రముఖ న్యాయవాది జడ శ్రావణ్ కుమార్? తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర అంశాలను వెల్లడించారు. ప్రశ్న రావణ్ తో తనకు అంతగా సంబంధాలేమీ లేవని చెప్పిన శ్రావణ్? రావణ్ కు అతడి కుటుంబం నుంచి కూడా పెద్దగా మద్దతు లేదని సంచలన వ్యాఖ్య చేశారు. రావణ్ వ్యవహారంలో విపక్ష వైసీపీ ద్వంద్వ వైఖరిని అవలంబిస్తోందని కూడా శ్రావణ్ ఆరోపించారు.ప్రశ్న రావణ్ తో తనకు పెద్దగా స్నేహమే లేదని శ్రావణ్ తెలిపారు. ఆకివీడు వ్యవహారంలోనే తనకు రావణ్ తో పరిచయం అయ్యిందని, ఆ తర్వాత తన ఇంటర్వ్యూ కోసం రావణ్ తనను సంప్రదించారని తెలిపారు. ఆ తర్వాత నుంచి ఇప్పటిదాకా కేవలం ఒకటి రెండు సార్లు మాత్రమే తాను రావణ్ తో ఫోన్ లో మాట్లాడానని ఆయన తెలిపారు. అంతకుమించి రావణ్ తో తనకు ప్రత్యక్ష సంబంధాలేమీ లేవని కూడా ఆయన పేర్కొనడం గమనార్హం. ఇక ఓ బాధ్యత కలిగిన సామాజిక వేత్తగా, న్యాయవాదిగా మాత్రమే తాను రావణ్ కేసులను వాదించానని, అంతకుమించి రావణ్ తో తనకు మైత్రి లేదని ఆయన తేల్చేశారు.ఇక రావణ్ ఓ రేంజిలో ఎలివేట్ కావడానికి దారి తీసిన ఏలూరు బహిరంగ సభలో అంతా తన ప్రమేయం లేకుండానే జరిగిపోయిందని శ్రావణ్ పేర్కొన్నారు. ఆ సభలో వేదిక మీదకు వచ్చేవారిలో రావణ్ పేరే లేదని ఆయన అన్నారు. ఆహ్వానితుల జాబితాలో పేరు లేకున్నా.. సభ నిర్వాహకుడిగా ఉన్న తన అనుమతి లేకుండానే రావణ్ వేదిక మీదకు వచ్చారని, అంతేకాకుండా తనకంటే ముందుగానే తన అనుమతి లేకుండా రావణ్ మైకందుకుని మరీ ప్రసంగించారని ఆయన ఆరోపించారు. అయితే వేడిపై శ్రవణ్ అన్న రమ్మంటేనే వచ్చానని రావణ్ మాట్లాడడం గమనార్హం. రావణ్ చేసిన ఘాటు వ్యాఖ్యలతో తనకు ఎలాంటి సంబంధం లేదని కూడా ఆయన తేల్చేశారు. తాను నిర్వహించిన సభలో తన అనుమతి లేకుండా మాట్లాడిన రావణ్ అరెస్టు అయ్యారని ఆయన పేర్కొన్నారు. ఈ మాటలు చూస్తుంటే జడ శ్రవణ్ ఈ కేసు నుండి తప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఇక రావణ్ కు వైసీపీ మద్దతు పలుకుతున్న వైనంపైనా శ్రావణ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అదికార కూటమికి చెందిన కీలక నేతలపై పరుష పదజాలంతో విరుచుకుపడుతున్న ప్రతి ఒక్కరికి వైసీపీ నుంచి మద్దతు లభిస్తోందని ఆయన అన్నారు. అందులో భాగంగానే రావణ్ కు వైసీపీ నుంచి మద్దతు లభించిందని ఆయన అన్నారు. అయితే రావణ్ హిందూ వ్యతిరేక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిన తర్వాత వైసీపీ అతడి నుంచి దూరం జరగాలని భావించిందని, అయితే అది అంత ఈజీ కాదన్న




విషయం తెలుసుకుని వైసీపీ నేతలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. తనకు మాత్రం వైసీపీ నుంచి ఎలాంటి మద్దతు లేదని ఆయన అన్నారు. ఎంగిలి మెతుకులనూ విదల్చని మాదిరిగా వ్యవహరిస్తున్న వైసీపీ నుంచి తనకు ఎలాంటి సాయం అవసరం లేదని కూడా ఆయన ఘాటు వ్యాఖ్య చేశారు.ఇక రావణ్ వ్యవహారంలో పరిమితికి మించి స్పందిస్తున్న ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్ వ్యవహారంపైనా శ్రావణ్ స్పందించారు. రావణ్, ప్రకాశ్ రాజ్ ల మధ్య చాలా కాలం నుంచే పరిచయం ఉన్నట్టుందని ఆయన వ్యాఖ్యానించారు. రావణ్ గురించి మాట్లాడేందుకే ప్రకాశ్ రాజ్ తనకు పలుమార్లు కాల్ చేశారని ఆయన చెప్పారు. ఇక రావణ్ కు అతడి కుటుంబం నుంచి ఎలాంటి మద్దతు లేదని చెప్పారు. రావణ్ కు న్యాయ సహకారంతో పాటుగా ఇతరత్రా సాయాన్ని కూడా తానే చేస్తున్నానని తెలిపారు. రావణ్ కు అన్నీ తానై సాయం చేస్తుంటే? అతడి బృందంలోని గమన అనే యువతి వైసీపీ అదినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని కలిసిన తీరుపై శ్రావణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

### దారిలోకి వచ్చిన ఎబీవీ

రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీవీ వెంకటేశ్వరరావు గత వైసీపీ పాలనలో ఎదుర్కొన్న ఇబ్బందులు తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే ఆయన పదవీ విరమణ చేశారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలపై పలు సందర్భాల్లో తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ వస్తున్నారు. గతంలో కూటమి ప్రభుత్వానికి సూచనలు చేసిన సందర్భాల్లోనూ ఆయన విమర్శలు ఎదుర్కొన్నారు.తాజాగా ఉపా చట్టం (యూఏపీఏ) వినియోగంపై తన అభిప్రాయాన్ని వెల్లడించిన ఏబీవీ, ఒక కార్యక్రమంలో మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబుతో వేదికను పంచుకోవడంపై వస్తున్న విమర్శలకు స్పందించారు. ఆ వేదికపై అంబటి రాంబాబు ఏమి మాట్లాడారో తాను వినలేదని, ఆయన పక్కన కూర్చున్నాననే కారణంతో సభ మధ్యలో లేచి వెళ్లిపోవడం సభా మర్యాద కాదని చెప్పారు."మీ అందరితో హీరో అనిపించుకోవడం కోసం నేను సంస్కారం వదిలేయాలా? మీరు నా గురించి పొరబడ్డారు. నేనలాంటి వాడిని కాదు" అంటూ ఏబీవీ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. గతంలో జగన్ ప్రభుత్వం మాట్లాడే స్వేచ్ఛ ఇవ్వలేదని, ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా అదే విధంగా వ్యవహరించాలనుకుంటుందా? అని ప్రశ్నించారు.ఇంతకుముందు అమరావతి భూసేకరణ అంశంపైనా ఏబీవీ స్పందించారు. రెండో విడతలో వేలాది ఎకరాల భూమిని సేకరించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రైతులు రోడ్డెక్కే పరిస్థితి వస్తే ప్రభుత్వానికి మద్దతుగా నిలవడం కష్టమవుతుందని హెచ్చరించారు. అలాగే అమరావతి నిర్మాణాన్ని మూడేళ్లలో పూర్తి చేయకపోతే కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేసినట్టేనని వ్యాఖ్యానించారు.అలాగే జగన్ ప్రతిపాదించిన 'మావిగన్' అంశాన్ని కూడా తేలికగా తీసుకోవద్దని సూచించారు. యూట్యూబ్ వ్యాఖ్యలపై ఉపా చట్టాన్ని ప్రయోగించే విషయంలో రాజద్రోహం కేసు అవసరం లేదని తన అభిప్రాయాన్ని వెల్లడించారు. దీంతో కూటమి కార్యకర్తల నుంచి విమర్శలు రావడంతో, తాను చేస్తున్న వ్యాఖ్యలను సద్విమర్శలుగా స్వీకరించాలని ఏబీవీ కోరుతున్నారు. ఈ నేపథ్యంలో వరుస పోస్టులు చేస్తూ తన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు.

# టీడీపీలో భారీ మార్పులు

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అధికార కూటమి పరిపాలనలో దూసుకుపోతున్న తరుణంలో, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు పార్టీ అంతర్గత బలోపేతంపై అత్యంత కీలకమైన వ్యూహాత్మక కసరత్తును ప్రారంభించారు. రాబోయే రోజుల్లో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత పటిష్టం చేసేందుకు ఒక భారీ ప్రక్షాళనకు శ్రీకారం చుట్టబోతున్నారు. ఇందులో భాగంగా చాలా మంది సీనియర్లను, యాక్టివ్‌గా లేని నాయకులను పక్కన పెట్టేసి, కొత్త ముఖాలకు, యువ నాయకత్వానికి పెద్దపీట వేయాలని టీడీపీ అధిష్టానం డిసైడ్ అయినట్లు తెలుస్తోంది.తెలుగుదేశం పార్టీకి సొంత ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాలపై టీడీపీ అధిష్టానం ఇప్పుడు ప్రత్యేక దృష్టి సారించింది. గత ఎన్నికల్లో కొన్ని సమీకరణాల వల్ల వెనుకబడిన ప్రాంతాలు లేదా ఇన్‌ఛార్జ్‌లు సరిగ్గా పని చేయని చోట్ల గ్రౌండ్ లెవెల్ రిపోర్ట్ తెప్పించుకుంటున్నారు. కేవలం పేరుకే ఇన్‌ఛార్జ్‌లుగా ఉంటూ, క్యాడర్‌ను పట్టించుకోని వారిని మార్చేయాలని చంద్రబాబు గట్టిగా ఉన్నారట. అక్కడ సమర్థులైన, ప్రజల్లో నిరంతరం ఉండే కొత్త నాయకులను ఎంపిక చేసే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించారు. ప్రారంభించిన సీఎం చంద్రబాబుఇక ఈ సమీక్షల్లో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏంటంటే.. మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలపైనా టీడీపీ అంతర్గతంగా సమీక్షలు నిర్వహిస్తోంది. కూటమి ధర్మం ప్రకారం ఆయా స్థానాలు మిత్రపక్షాలకే ఉన్నప్పటికీ, అక్కడ టీడీపీ ఓటు బ్యాంక్ చెల్లాచెదురు కాకుండా చూసుకోవడం, క్యాడర్‌ను యాక్టివ్‌గా ఉంచడం అత్యవసరం అని భావిస్తున్నారు. భవిష్యత్తు రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని, మిత్రపక్షాల స్థానాల్లో కూడా టీడీపీ బలాన్ని తగ్గకుండా చూసుకునేందుకు అంతర్గత సమన్వయ కమిటీలను ఏర్పాటు



చేస్తున్నారు.మరోవైపు, గత ఎన్నికల్లో వైసీపీ గెలుచుకున్న ఆ 11 నియోజకవర్గాలపై టీడీపీ టాప్ ప్రయారిటీ పెట్టింది. ఆ 11 స్థానాల్లో వైసీపీని పూర్తిగా ఖాళీ చేయడమే లక్ష్యంగా కసరత్తు జరుగుతోంది. అక్కడ పార్టీ ఎందుకు ఓడిపోయింది? ఎక్కడ లోపాలు జరిగాయి? అనే విషయాలపై ప్రత్యేక నివేదికలు తెప్పించుకున్నారు. ఆ నియోజకవర్గాల్లో ప్రస్తుత ఇన్‌ఛార్జ్‌ల పనితీరును బేరీజు వేస్తున్నారు. ఒకవేళ వారి వల్ల పార్టీ పుంజుకునే అవకాశం లేదని తేలితే, క్షణం కూడా ఆలోచించకుండా వారిని పక్కన పెట్టి.. ఆర్థికంగా, అంగబలం పరంగా, ప్రజల్లో క్రేజ్ ఉన్న సరికొత్త సమర్థ నాయకులను రంగంలోకి దించేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.ఇక అన్నింటికంటే ముఖ్యమైన విషయం ఏంటంటే.. ఈసారి సమీక్షల్లో కేవలం "పనితీరు" మాత్రమే ఏకైక ప్రామాణికం అని చంద్రబాబు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎంతటి సీనియర్ నాయకుడైనా, గతంలో ఎంత పెద్ద పదవి అనుభవించినా సరే.. ఇప్పుడు క్షేత్రస్థాయిలో యాక్టివ్‌గా లేకపోతే, సమన్వయ కమిటీలు సరిగ్గా నడపకపోతే వారిని తప్పించడం ఖాయంగా కనిపిస్తోంది. చాలా మంది పాత తరం నేతలను పక్కన పెట్టేసి, కొత్త వారికి, యువతకు ఛాన్స్ ఇవ్వాలనే గట్టి ఆలోచనలో అధిష్టానం ఉంది.

# మార్చిలోనే పోలవరం ప్రారంభం

**ఏలూరు :** పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సమాచారం వెల్లడించారు. ప్రస్తుతం 89 శాతం మేర పనులు జరిగాయని, గోదావరి పుష్కరాలు కంటే ముందుగానే నిర్మాణం పూర్తి చేస్తామని ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చి కల్లా ప్రాజెక్టు పూర్తవుతుందని, ఆ తర్వాత జాతికి అంకితం చేస్తామని సీఎం పేర్కొన్నారు. గోదావరి జిల్లాల పర్యటన సందర్భంగా ధవళేశ్వరం బ్యారేజి వద్ద జరిగిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ పునరుద్ధరణ, పోలవరం ప్రాజెక్టుపై ముఖ్యమైన సమాచారాన్ని సీఎం పంచుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా తీసుకున్న పోలవరం పనులు 89 శాతం పూర్తయ్యాయని సీఎం చంద్రబాబు వివరించారు. రెండేళ్లలోనే పనులు పరుగులు పెట్టించామని వ్యాఖ్యానించారు. 2014-19 మధ్య పోలవరం ప్రాజెక్టును 72 శాతం పూర్తి చేశామని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 2 శాతం పనులు మాత్రమే చేసి చేతులెత్తేసిందని విమర్శించారు. 2019లో టీడీపీ ప్రభుత్వం కొనసాగి ఉంటే 2021 నాటికి పోలవరం పూర్తి చేసేవారమని సీఎం వ్యాఖ్యానించారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేసి వచ్చే మార్చిలో ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని సీఎం హామీ ఇచ్చారుఇక ధవళేశ్వరం పర్యటన తర్వాత సీఎం పోలవరం ప్రాజెక్టును పరిశీలించారు. ముందుగా హెలికాప్టర్ నుంచి గోదావరి ప్రవాహం, ఎగువ దిగువ కాపర్ డ్యాం పనులను చూశారు. అనంతరం ప్రాజెక్టులోని ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యాం గ్యాప్ 1, గ్యాప్ 2 నిర్మాణాలను విద్యుత్ ఉత్పత్తి కేంద్రం పనులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. నిర్దేశిత సమయంలోగా పనులు పూర్తి చేసేలా సిబ్బంది పనిచేయాలని పిలుపునిచ్చారు. కాగా, కూటమి ప్రధాన ఎన్నికల హామీ అయిన పోలవరం ప్రాజెక్టును గోదావరి పుష్కరాలు కంటే ముందుగానే పూర్తి చేస్తామనే పట్టుదల ప్రభుత్వంలో కనిపిస్తోందని వ్యాఖ్యానిస్తున్నారు. గత రెండేళ్లలో సుమారు 24 వేల కోట్లతో సాగునీటి ప్రాజెక్టులను చేపడుతున్న ప్రభుత్వం పోలవరం పూర్తికి అధిక ప్రాధాన్యమిస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం స్పిల్ వేతోపాటు ఈసీఎఫ్ఆర్ గ్యాప్ 1, గ్యాప్ 2 పనులు పూర్తయ్యాయని చెబుతున్నారు. ఇంకా జల విద్యుత్ కేంద్రం నిర్మాణాలు మాత్రమే పెండింగులో ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం పూర్తయిన పనులతో కాలువలకు నీరు విడుదల చేసే అవకాశాలు ఉన్నా ప్రాజెక్టును పూర్తిస్థాయిలో సిద్ధం చేశాకే ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోందని చెబుతున్నారు. దీంతో వచ్చే ఖరీఫ్ నాటికి పోలవరం అందుబాటులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానిస్తున్నారు.

## కాపు ఉద్యమ నేత ముద్రగడ ఇకలేరు



-మొదటిపేజీ తరువాయి

కొంతకాలంగా ఇబ్బంది పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మరణవార్తతో ఏపీ రాజకీయ వర్గాల్లో, ఆయన అనుచరుల్లో తీవ్ర విషాదం నెలకొంది. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో 1953, జనవరి 22న జన్మించిన ముద్రగడ పద్మనాభం, కాపు సామాజిక వర్గ రిజర్వేషన్ల కోసం సాగించిన ఉద్యమాలతో రాష్ట్రవ్యాప్తంగా బలమైన నేతగా గుర్తింపు పొందారు. తన రాజకీయ జీవితంలో అనేక పార్టీలలో పనిచేసిన ఆయన, ఇటీవలి కాలంలో వైసీపీలో చేరి, ఆ పార్టీలోనే కొనసాగారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ముద్రగడ, 1977లో ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 1978లో జనతా పార్టీ తరఫున తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ సమయంలో ప్రత్తిపాడు నుంచి గెలిచారు. అనంతరం 1982లో తెలుగుదేశం పార్టీలో చేరి 1983, 1985, 1989 ఎన్నికల్లో వరుసగా గెలుపొందారు. ఎన్టీఆర్ మంత్రివర్గంలో మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత టీడీపీతో విభేదించి ప్రజా రక్షణ సమితి, తెలుగునాడు పేర్లతో సొంత పార్టీలు స్థాపించారు. 1999లో కాకినాడ నుంచి ఎంపీగా కూడా విజయం సాధించారు. రాజకీయ నాయకుడిగా కంటే కాపు ఉద్యమ నేతగా ముద్రగడ పద్మనాభం రాష్ట్రవ్యాప్తంగా సుపరిచితులు. కాపులకు రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఆయన అనేక పోరాటాలు, దీక్షలు చేపట్టారు. ముఖ్యంగా, 2016లో తునిలో ఆయన ఆధ్వర్యంలో జరిగిన 'కాపు ఐక్య గర్జన' సభ, తదనంతర పరిణామాలు అప్పట్లో రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టించాయి. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన రాజకీయ వైఖరి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. పిఠాపురం నియోజకవర్గంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను ఓడిస్తానని సవాల్ విసిరారు. ఆ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ ఘన విజయం సాధించడంతో, తాను ఇచ్చిన మాటకు కట్టుబడి ముద్రగడ తన పేరును 'ముద్రగడ పద్మనాభరెడ్డి'గా గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అధికారికంగా మార్చుకున్నారు. గత ఏడాది కాలంగా వయసు రీత్యా పలు ఆరోగ్య సమస్యలతో ఆయన తరచూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ముద్రగడకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపట్ల పలువురు రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు.

## ప్రభుత్వ నిర్లక్ష్యమే మత్స్యకారుల ప్రాణాలు బలిగొంది

-మొదటిపేజీ తరువాయి

పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చామని వైయస్ జగన్ గుర్తు చేశారు. మత్స్యకారుల మరణాలపై ఎక్స్‌గ్రేషియాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో పాటు, విదేశాల్లో చిక్కుకున్న మత్స్యకారులను స్వదేశానికి తీసుకురావడం, ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టడం, విశాఖ ఫిషింగ్ హార్బర్ అగ్నిప్రమాద బాధితులకు వెంటనే పరిహారం అందించడం వంటి అనేక సంక్షేమ చర్యలు చేపట్టామని వివరించారు. బోటు ప్రమాద బాధిత కుటుంబాలకు పూర్తి న్యాయం జరిగే వరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారి పక్షాన పోరాటం కొనసాగిస్తుందని వైయస్ జగన్ స్పష్టం చేశారు.

## సర్ గడువు పొడిగింపు

-మొదటిపేజీ తరువాయి

ప్రచురించనున్నారు. అదే రోజు నుంచి ఆగస్టు 30 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ చేపట్టనున్నారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియ జులై 31 నుంచి సెప్టెంబర్ 28 వరకు కొనసాగుతుంది. అనంతరం అక్టోబర్ 3న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. సవరించిన షెడ్యూల్‌ను అన్ని అధికారులకు తెలియజేయడంతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. రాజకీయ పార్టీలకు కూడా ఈ మార్పులను లిఖితపూర్వకంగా తెలియజేయాలని సూచించింది.

### 99.98 శాతం ఫారాల పంపిణీ పూర్తి

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 4,16,27,694 మంది ఓటర్లు ఉన్నారు. వీరి వివరాల నమోదు, తప్పుల సవరణల కోసం అధికారులు పకడ్బందీగా ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ భారీ ప్రక్రియలో మొత్తం 46,397 మంది బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌ఓలు) పాల్గొన్నారు. ఇప్పటివరకు 4,16,20,565 గణన పత్రాలను ఓటర్ల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. అంటే, రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 99.98 శాతం గణన పత్రాల పంపిణీ విజయవంతంగా పూర్తయింది. ఫారాల పంపిణీ దాదాపుగా పూర్తయినప్పటికీ, ఓటర్ల నుంచి వాటిని తిరిగి సేకరించడంలో కొంత జాప్యం జరుగుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఇంకా సుమారు 40.86 లక్షల గణన పత్రాలు తిరిగి అందాల్సి ఉందని సమాచారం. మరోవైపు జూలై 12 సాయంత్రం నాటికి 93.29 శాతం పత్రాల డిజిటలైజేషన్ పూర్తయింది. ఇంకా సుమారు 27.86 లక్షల ఫారాల డిజిటలైజేషన్ పెండింగ్‌లో ఉంది. గడువు ముగియనుండటంతో అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి సారించారు. బీఎల్వోలు, బీఎల్ఏలతో అత్యవసర సమావేశాలు నిర్వహించారు. గణన పత్రాల సేకరణ, డిజిటలైజేషన్‌ను వెంటనే పూర్తి చేయాలని జిల్లా అధికారులకు ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

## అధికారులు నాలుగు గోడలు దాటి వెళ్లాలి

-మొదటిపేజీ తరువాయి




ఆర్థిక నివేదికలను విడుదల చేస్తామని దానికి అనుగుణంగా రాష్ట్ర పురోగతి కోసం ప్రభుత్వ శాఖలు పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. నెలవారీ ఆర్థిక నివేదికల ద్వారా ఎప్పటికప్పుడు రెవెన్యూ రాబడులను అంచనా వేసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. అధికారులు, ఉద్యోగుల నెలవారీ పనితీరును, నైపుణ్యాలను కూడా ఎప్పటికప్పుడు అంచనా వేసుకుని ముందుకు వెళ్తామన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ...'2019--2024 మధ్య అన్ని వ్యవస్థలు చిన్నాభిన్నం అయ్యాయి. రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. సంక్షేమం, అభివద్ధి, సుపరిపాలన కోసం రెండేళ్లుగా సమిష్టిగా పనిచేసాం. ప్రభుత్వ ఆలోచనల్ని అధికార యంత్రాంగం సమర్ధంగా అమలు చేసింది. క్షేత్రస్థాయిలో ఆశించిన మార్పుల్ని కొంతవరకు సాధించగలిగాం. సుపరిపాలన అందించేలా ప్రతీ సోమవారం ఆర్టీజీఎస్ నుంచి సమీక్షలతో పాటు 4 సార్లు మంత్రులు, కార్యదర్శుల సమావేశాలు, 7 సార్లు కలెక్టర్ల సదస్సులు నిర్వహించాం. 19 ఎస్ఐపీబీ సమావేశాలు, 52 కేబినెట్ సమావేశాల ద్వారా పెట్టుబడులకు ఆమోదం తెలిపాం. ఏపీని పారిశ్రామికంగా అగ్రగామిగా నిలబెట్టాలనే ఆలోచనతో పనిచేస్తున్నాం. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ఇలా అన్ని జిల్లాల్లో అపారమైన వనరులు, పెట్టుబడి అవకాశాలు ఉన్నాయి. రేర్ ఎర్త్ మినరల్స్, సిలికా, గ్రానైట్ , బాక్సైట్ సహా విలువైన వనరులను వాల్యూ అడిషన్ చేసేలా ప్రణాళికలు రూపొందించాం. 'గత పాలనలో కొన్ని ప్రభుత్వ శాఖల్లో పనితీరు మెరుగ్గా లేకపోవటంతో ప్రజల నుంచి పెద్దఎత్తున అర్జీలు వచ్చాయి. పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టమ్ ద్వారా ఈ అర్జీలను వేగంగా పరిష్కరించి ప్రజలకు స్వాంతన కలిగించాలి. గత పాలకుల వల్ల రెవెన్యూ శాఖలో అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. భూ వివాదాలకు సంబంధించిన అర్జీలను పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాల్సి వచ్చింది. ఎల్‌నినో కారణంగా తలెత్తిన తీవ్ర వర్షాభావ పరిస్థితులపై రైతులకు, ప్రజలకు అవగాహన కల్పించాలి. ఒక మంచి అధికారి సమస్యలను పరిష్కారిస్తే...అద్భుతంగా పనిచేసే అధికారి అసలు సమస్యలనేవే తలెత్తకుండా చూస్తారనే కోణంలో అందరూ పనిచేయాలి. ఈ సమావేశానికి మంత్రులు, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఆయా శాఖల కార్యదర్శులు, హెచ్ఓడీలు హాజరయ్యారు.

# సంపాదకీయం

## జ్ఞానభూమి పిలుపు!


ప్రపంచ విద్యా చిత్రపటంలో భారత్ మళ్లీ తనదైన ముద్ర వేసుకుంటోంది. ఒకనాడు నలంద, తక్షశిల, విక్రమశిల విశ్వవిద్యాలయాల్లో దేశదేశాల విద్యార్థులు జ్ఞానాన్వేషణ చేసిన ఘన చరిత్ర మనది. చైనా యాత్రికులు హ్యుయాన్‌త్సాంగ్, ఫాహియాన్ వంటివారు వేల మైళ్లు ప్రయాణించి మరీ ఇక్కడి విద్యాలయాల్లో అభ్యసించారంటే.. అప్పట్లో భారతావని జ్ఞానకేంద్రంగా ఎంతటి వైభవాన్ని అనుభవించిందో అర్థం చేసుకోవచ్చు. శతాబ్దాల విదేశీ పాలన, అనంతర పరిణామాల్లో ఆ ప్రాభవం మసకబారినా.. నేడు మళ్లీ అంతర్జాతీయ విద్యార్థులకు భారత్ ఆకర్షణీయ గమ్యంగా రూపుదిద్దుకుంటోంది. కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ విడుదల చేసిన 'అఖిల భారత ఉన్నత విద్యా సర్వే (ఏఐఎస్‌హెచ్‌ఈ) 2023-24' ఈ వాస్తవాన్ని గణాంకాలతో సహా నిరూపించింది. ఏకంగా 173 దేశాలనుంచి 58,134 మంది విదేశీ విద్యార్థులు భారత విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో చదువుకుంటున్నారని సర్వే తేల్చింది. 2019-20లో 48,898గా ఉన్న ఈ సంఖ్య ఐదేళ్లలో 9,236 మేర పెరిగి 18.9 శాతం వృద్ధి నమోదు చేయడం విశేషం. పొరుగుదేశం నేపాల్ నుంచే అత్యధికంగా 24.1 శాతం విద్యార్థులు వస్తుండగా.. యూఏఈ, అమెరికా, బంగ్లాదేశ్, నైజీరియా, జింబాబ్వే తర్వాతి స్థానాల్లో నిలిచాయి. లెబనాన్, బుర్కినాఫాసో, మంగోలియా, మెక్సికో, కజకిస్థాన్, బెలారస్, చిలీవంటి సుదూర దేశాల విద్యార్థులు సైతం భారత విద్యాసంస్థల వైపు చూస్తుండటం గమనార్హం. రాష్ట్రాలవారీగా చూస్తే 7,914 మంది విదేశీ విద్యార్థులతో కర్ణాటక టాప్‌లోవుంటే.. 7,902 మందితో పంజాబ్ రెండో స్థానానికి పరిమితమైంది. మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, తమిళనాడు తొలి ఐదుస్థానాల్లో నిలిచాయి. బెంగళూరు వంటి నగరాలు ఐటీ రాజధానులుగా, విద్యా కేంద్రాలుగా అంతర్జాతీయ ఖ్యాతి గడించడమే కర్ణాటక ఆధిక్యానికి కారణమనేది సుస్పష్టం. వచ్చే విద్యార్థుల్లో 73.6 శాతంమంది డిగ్రీ కోర్సుల్లో, 16.8 శాతంమంది పీజీ ప్రోగ్రాముల్లో చేరుతుండటం.. భారత ఉన్నత విద్యపై ప్రపంచ యువతలో పెరుగుతున్న విశ్వాసానికి నిలువుటద్దం!

నిజానికి -ప్రపంచవ్యాప్తంగా సరిహద్దులు దాటి చదువుకుంటున్న విద్యార్థుల సంఖ్య 65 లక్షలకు పైమాటే. అందులో భారత్‌కు దక్కుతున్న వాటా 58 వేలంటే.. ఒక్క శాతం కూడా కాదన్నది చేదు నిజం! అమెరికా పది లక్షలకు పైగా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా చెరో ఐదారు లక్షలమంది అంతర్జాతీయ విద్యార్థులను ఆకర్షిస్తుంటే.. 1,100కి పైగా విశ్వవిద్యాలయాలు, 50 వేలకు పైగా కళాశాలలతో ప్రపంచంలోనే అతిపెద్ద ఉన్నత విద్యా వ్యవస్థల్లో ఒకటిగా ఉన్న భారత్ ఇంత వెనుకబడటం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశమే. మరోవైపు ఏటా ఎనిమిది లక్షల మందికి పైగా భారతీయ విద్యార్థులు విదేశీ బాట పడుతూ లక్షల కోట్ల రూపాయలను విదేశీ మారక ద్రవ్యం రూపంలో బయటకు తరలిస్తున్నారు. అంటే మనం 'పంపే' విద్యార్థులకు, 'రప్పించుకునే' విద్యార్థులకు మధ్య అగాధమంత అంతరం నెలకొందన్నమాట! ఈ అసమతుల్యతను సరిదిద్దకుండా విద్యారంగంలో 'విశ్వగురు' హోదా సాధించడం అసాధ్యం! మనవద్దకు వస్తున్న విద్యార్థుల్లో అత్యధికులు నేపాల్, బంగ్లాదేశ్, ఆఫ్రికా దేశాలవారే తప్ప.. అభివృద్ధి చెందిన దేశాలనుంచి వచ్చేవారి సంఖ్య పరిమితమే. అంతర్జాతీయ ర్యాంకింగుల్లో భారత విద్యాసంస్థల స్థానం ఆశించిన స్థాయిలో లేకపోవడం, పరిశోధనలపై పెట్టుబడులు జీడీపీలో ఒక శాతానికి లోబడే ఉండటం, బోధన సిబ్బంది కొరత, మౌలిక వసతుల లేమి, హాస్టళ్ల సమస్యలు, వీసా ప్రక్రియలో జాప్యాలు.. ఇవన్నీ విదేశీ విద్యార్థుల రాకకు అవరోధాలుగా నిలుస్తున్నాయి. ఆఫ్రికా దేశాల విద్యార్థులపై అక్కడక్కడా చోటుచేసుకున్న వివక్షాపూరిత ఘటనలు దేశ ప్రతిష్ఠను దెబ్బతీసిన సందర్భాలూ లేకపోలేదు. విదేశీ విద్యార్థుల్లో మహిళల సంఖ్య 20,839కి పెరగడం సానుకూలాంశమే అయినా.. పురుషులతో పోలిస్తే (37,295) ఇంకా చాలా తక్కువే. భద్రత, వసతి సదుపాయాలపై మరింత భరోసా కల్పిస్తేనే ఈ అంతరమూ తగ్గుతుంది. ఉత్తమ శ్రేణి విద్య, తక్కువ ఖర్చు, ఆంగ్ల మాధ్యమం, సాంస్కృతిక వైవిధ్యంవంటి బలాలు మనకున్నా.. వాటిని ప్రపంచానికి సమర్థంగా చాటిచెప్పడంలో వెనుకబడుతున్నామన్నది కఠోర వాస్తవం.

ఈ సవాళ్లను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం 2018లో ప్రారంభించిన 'స్టడీ ఇన్ ఇండియా' కార్యక్రమం సరైన దిశలో పడిన తొలి అడుగు. జాతీయ విద్యా విధానం-2020 సైతం భారత్‌ను అంతర్జాతీయ విద్యా కేంద్రంగా తీర్చిదిద్దాలన్న సంకల్పాన్ని స్పష్టంగా ప్రకటించింది. విదేశీ విశ్వవిద్యాలయాలు భారత్‌లో క్యాంపస్‌లు నెలకొల్పేందుకు యూజీసీ నిబంధనలను సరళీకరించడం, గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో ప్రతిష్ఠాత్మక విదేశీ వర్సిటీలు అడుగుపెట్టడం, ఐఐటీలు మద్రాస్, ఢిల్లీవంటివి జాంజిబార్, అబుదాబిల్లో క్యాంపస్‌లు ప్రారంభించడం.. ఈ పరిణామాలన్నీ భారత విద్యారంగ అంతర్జాతీయీకరణకు ఊతమిచ్చేవే. అయితే ప్రకటనలు, విధానాలతోనే సరిపెట్టుకోకుండా క్షేత్రస్థాయిలో పటిష్ఠ చర్యలు చేపట్టినప్పుడే ఆశించిన ఫలితాలు సిద్ధిస్తాయి. విదేశీ విద్యార్థులకు వీసా జారీ ప్రక్రియను మరింత సులభతరం, వేగవంతం చేయాలి. అంతర్జాతీయ ప్రమాణాలకు దీటైన హాస్టళ్లు, ప్రయోగశాలలు, డిజిటల్ మౌలిక వసతులను విద్యాసంస్థల్లో సమకూర్చాలి. ఉపకార వేతనాలను గణనీయంగా పెంచి ప్రతిభావంతులైన విదేశీ విద్యార్థులను ఆకర్షించాలి. చదువు పూర్తయ్యాక కొంతకాలం ఇక్కడే పనిచేసుకునే వెసులుబాటు కల్పిస్తే.. అమెరికా, కెనడాల తరహాలో భారత్ సైతం ప్రతిభావంతులకు గమ్యస్థానంగా మారుతుంది. పరిశోధనలపై పెట్టుబడులను పెంచి, పరిశ్రమ-విద్యాసంస్థల భాగస్వామ్యాన్ని బలోపేతం చేసి, అంతర్జాతీయ ర్యాంకింగుల్లో మన వర్సిటీల స్థానాన్ని మెరుగుపరచడమూ అత్యవసరమే. నేపాల్ మొదలు జింబాబ్వే దాకా విస్తరించిన ఈ విద్యా బంధాలే భవిష్యత్తులో వాణిజ్య, దౌత్య సంబంధాలకు వారధులవుతాయి. ఐదేళ్లలో 18.9 శాతం వృద్ధి ఆహ్వానించదగినదే అయినా.. ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా కలిగిన, జ్ఞానాధారిత ఆర్థిక వ్యవస్థగా ఎదగాలని ఉవ్విళ్లూరుతున్న భారత్‌కు ఇది ఏమాత్రం సరిపోదు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని చేరుకోవాలంటే.. విద్యారంగంలో ప్రపంచ నాయకత్వం అనివార్యం. ప్రాచీన నలందా వైభవాన్ని ఆధునిక రూపంలో పునరుద్ధరించి, 'చదువుల చిరునామా'గా భారత్ మళ్లీ ప్రపంచ పటంపై ప్రకాశించాలంటే.. ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, సమాజం సమష్టిగా కదలాల్సిన తరుణమిదే!

---

### పనికొచ్చే పలుకు



## జ్ఞానమే కాదు.. సాధనా ఉండాలి!

"తెలిసి ఉండడం మాత్రమే సరిపోదు, దానిని ఆచరణలో పెట్టాలి. కోరిక ఉంటేనే సరిపోదు, దానిని చేసి చూపించాలి" అని జర్మనీకి చెందిన ప్రసిద్ధ మేధావి జోహాన్ వోల్ఫ్‌గ్యాంగ్ వాన్ గోథే పేర్కొన్నారు. ఈ మాటలు చదవడానికి ఎంతో సరళంగా అనిపించినప్పటికీ, వీటి వెనుక ఎంతో లోతైన అర్థం దాగి ఉంది. కేవలం ఆలోచనలకు పరిమితం కాకుండా, వాటిని కార్యాచరణలో పెట్టినప్పుడే నిజమైన విజయం లభిస్తుందని కాలాతీత సూక్తి మనకు గుర్తుచేస్తోంది.

జర్మన్ సాహిత్య చరిత్రలోనే అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల్లో గోథే ఒకరు. ఆయన కేవలం రచయిత మాత్రమే కాదు; ఒక తత్వవేత్తగా, శాస్త్రవేత్తగా, రాజకీయ నాయకుడిగా బహుముఖ ప్రజ్ఞాపాటవాలు ప్రదర్శించారు. ఆయన రాసిన 'ఫాస్ట్', 'ది సారోస్ ఆఫ్ యంగ్ వెర్దర్' వంటి రచనలు ప్రపంచ ప్రసిద్ధి చెందాయి. ఆయన చెప్పిన ఈ మాటలు శతాబ్దాలు దాటినా నేటికీ ఎంతోమందికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయి. కేవలం ఆలోచనలు ఉండడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదు, వాటిని చేతల్లో చూపించినప్పుడే వాటికి విలువ వస్తుందనేది ఆయన ప్రతిపాదించిన ప్రధాన తత్వం.

ఈ సూక్తి అంతరార్థం ఏమిటి?

సాధారణంగా మనలో చాలా మందికి జీవితంలో ఏం చేయాలో, ఏది మంచో ఏది చెడో బాగా తెలుసు. ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం తినాలని, రోజూ వ్యాయామం చేయాలని, భవిష్యత్తు కోసం డబ్బు దాచుకోవాలని, కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాలని అందరికీ అవగాహన ఉంటుంది. జీవితాన్ని మార్చుకోవాలనే కోరిక కూడా ఉంటుంది. కానీ, ఆచరణ విషయానికి వచ్చేసరికి మాత్రం వెనకడుగు వేస్తారు. ఇక్కడే గోథే సూక్తి ప్రాధాన్యత అర్థమవుతుంది. మనకు ఎంత సమాచారం ఉందనేది ముఖ్యం కాదు, దానిని ఎంతవరకు ఉపయోగించామనేదే ముఖ్యం. అలాగే మంచి సంకల్పాలు ఉండడం అభినందనీయమే అయినా, అవి స్థిరమైన ప్రయత్నంగా మారినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయి.

ప్రస్తుత 2026 నాటి ఆధునిక ప్రపంచంలో సమాచారం మన వేలికొనలపైనే లభిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, పెట్టుబడులు, ఫిట్‌నెస్, వ్యాపార సూత్రాలు.. ఇలా ఏ విషయాన్నైనా ఇంటర్నెట్ ద్వారా కొన్ని క్లిక్కులతో నేర్చుకోవచ్చు. ఎన్నో పాడ్‌కాస్ట్‌లు, పుస్తకాలు, వీడియోలు, ఆన్‌లైన్ కోర్సులు మనకు అందుబాటులో ఉన్నాయి. అయితే, జ్ఞానాన్ని సేకరించడం వేరు, దాని ద్వారా ఫలితాలను సాధించడం వేరు. నాయకత్వం గురించి పుస్తకాలు చదివినంత మాత్రాన ఎవరూ నాయకులు అయిపోరు. ఫిట్‌నెస్ వీడియోలు చూసినంత మాత్రాన ఆరోగ్యం చేకూరదు. అన్నీ పరిపూర్ణంగా ఉండే వరకు వేచి చూడకుండా, వెంటనే రంగంలోకి దిగి పనిని ప్రారంభించేవారే నిజమైన విజేతలుగా నిలుస్తారు.

'సరైన సమయం' కోసం వేచి చూడకండి

వ్యక్తిగత ఎదుగుదలకు అడ్డుపడే అతిపెద్ద ఆటంకం ఏమిటంటే, 'సరైన సమయం' కోసం వేచి చూడడం. మరింత ఆత్మవిశ్వాసం వచ్చాక లేదా పూర్తి సన్నద్ధత సాధించాక నిర్ణయాలు తీసుకుందామని చాలా మంది పనులను వాయిదా వేస్తుంటారు. కానీ నిజానికి, పనిని ప్రారంభించిన తర్వాతే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ప్రతి నిపుణుడు కూడా ఒకప్పుడు సందేహాలతోనే తన ప్రయాణాన్ని మొదలుపెట్టిన సాధారణ వ్యక్తనే విషయాన్ని మరువకూడదు. విజయం అనేది ఒకే రోజులో వచ్చేది కాదు, నిరంతర ఆచరణ ద్వారానే సాధ్యమవుతుంది.

జ్ఞానమనేది పునాది అయితే, మంచి ఆలోచన ఒక చిన్న నిప్పుకణిక లాంటిది. కానీ మార్పును సృష్టించేది మాత్రం కేవలం కార్యాచరణే. కలలు నిజం కావాలంటే నిద్ర లేచి వాటి వెనుక పరుగెత్తడం ప్రారంభించాల్సిందే!

---

# కునుకే కురిపించును.. క్షేమం!

*గాలి, నీరు, ఆహారం తర్వాత జీవానికి అంతే అవసరమైనది నిద్ర. మనం నిశ్చలంగా కళ్లు మూసిన ఆ ఘడియల్లోనే శరీరం లోలోపల కణాల మరమ్మతుల మహా యజ్ఞాన్ని నడిపిస్తుంది. కానీ నేటి ఉరుకుల పరుగుల జీవనశైలిలో ప్రశాంతమైన కునుకు అరుదైన వరంగా మారిపోయింది. నిద్రలేమి రుగ్మతలతో కోట్లాది మంది సతమతమవుతూ.. మాత్రల వైపు పరుగులు తీస్తూ సమస్యను మరింత జటిలం చేసుకుంటున్నారు. ఆరోగ్యం, ఆనందం, ఆయుష్షు.. ఈ మూడింటికీ పునాది వేసే నిదుర 'ఔషధం' విలువను గుర్తెరగాల్సిన తరుణమిదే!*




మనిషి జీవితకాలంలో దాదాపు మూడో వంతు నిద్రలోనే గడిచిపోతుంది. అయినా ఆ అమూల్య సమయాన్ని మనం ఏనాడూ విలువైనదిగా పరిగణించం. నిజానికి నిద్ర అనేది ధ్యానానికి దగ్గరగా నిలిచే అత్యుత్తమ విశ్రాంతి సాధనం. అందుకే హాయిగా నిద్రపోగలిగినవారు ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటారన్నది అనుభవసిద్ధ సత్యం. రాత్రి కంటినిండా కునుకు తీసినవారు మరునాడు ఉదయం తాజాదనంతో, ఉత్సాహంతో, రెట్టించిన శక్తితో మేల్కొంటారు. కానీ నేటి ఉరుకుల పరుగుల ప్రపంచంలో ప్రశాంతమైన నిద్ర అరుదైన వరంగా మారిపోయింది. స్లీప్ అప్నియా, ఇన్‌సోమ్నియా (నిద్రలేమి), రెస్ట్‌లెస్ లెగ్ సిండ్రోమ్, నార్కోలెప్సీ వంటి నిద్ర సంబంధిత రుగ్మతలతో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది సతమతమవుతున్నారు. ఇక అర్ధరాత్రి వరకూ అటూఇటూ దొర్లుతూ.. మధ్యమధ్యలో మెలకువ వచ్చేస్తూ.. తునాతునకలైన నిద్రతో నెట్టుకొచ్చేవారి సంఖ్య అంతకు ఎన్నో రెట్లు అధికం. విషాదమేమిటంటే.. వీరిలో చాలామంది నిద్రమాత్రలు, మత్తుమందుల వైపు మొగ్గుచూపుతూ సమస్యను మరింత జటిలం చేసుకుంటున్నారు. నిద్రలేమిని అసలు తీవ్రమైన సమస్యగా భావించకపోవడమే ఈ నిర్లక్ష్యానికి మూలకారణం. మరునాటి కోసం శరీరానికి అవసరమైన శక్తిని పునరుద్ధరించే ప్రక్రియకు ఈ రుగ్మతలు తీవ్ర విఘాతం కలిగిస్తాయన్న వాస్తవాన్ని మనం సౌకర్యంగా విస్మరిస్తున్నాం. నిద్రను కేవలం శరీరం పనిచేయని 'జడ సమయం'గా చూడటం మనం చేస్తున్న పెద్ద పొరపాటు. వాస్తవమేమిటంటే.. మనం అత్యంత నిశ్చలంగా కనిపించే ఆ నిద్రా ఘడియల్లోనే మన లోపల ఏదో ఒక శక్తి అత్యంత చురుగ్గా పనిచేస్తూ.. మరుసటి రోజు కోసం శరీర కణాలను రీఛార్జ్ చేస్తుంటుంది. కంటికి కునుకు పడుతున్న ప్రతి క్షణం.. లోలోపల ఒక మహా యజ్ఞమే జరుగుతోందన్నమాట!

అలసటను జయించే అతిపెద్ద దివ్యౌషధం నిద్రేనన్నది నిర్వివాదాంశం. శరీరానికి అవసరమైనప్పుడు అది మనల్ని అమాంతం ఆవహించేస్తుంది. నిద్రను కొంతసేపు వాయిదా వేయగలమేమో కానీ.. శాశ్వతంగా దూరం పెట్టడం అసంభవం. కండరాలను, నరాలను, మెదడు కణాలను తిరిగి క్రియాశీలం చేసే ఆరోగ్యదాయకమైన, ఆహ్లాదకరమైన నిద్ర.. ప్రకృతి ప్రసాదించిన గొప్ప పునరుజ్జీవన వరాల్లో ఒకటి. అందుకే గాలి, నీరు, ఆహారం ఎంత అవసరమో.. జీవితానికి నిద్రా అంతే అత్యవసరం. మనం నిద్రించే వేళల్లో శరీరం ఎంతో బిజీగా ఉంటుంది. కణజాలాల మరమ్మతులు, గాయాల మానుపు, అవయవాలకూ కణాలకూ ఇంధనం నింపడం, పాత కణాల స్థానంలో కొత్తవాటిని సృష్టించడం.. ఇలా ఎన్నో కీలక ప్రక్రియలు అప్పుడే సాగుతాయి. మెలకువగా ఉన్నప్పటికంటే నిద్రలోనే ఈ పునర్నిర్మాణ కార్యక్రమాలు ఎన్నో రెట్లు వేగంగా జరుగుతాయని వైద్యశాస్త్రం చెబుతోంది. మరి ఇంతటి విలువైన నిద్రకు అతిపెద్ద అవరోధం ఏమిటి? నిస్సందేహంగా అది మానసిక అనారోగ్యమే! పగటిపూట మనం అలవాటుగా చేసే ప్రతికూల ఆలోచనలు, అనుచిత చర్యలే రాత్రిపూట నిద్రకు భంగం కలిగిస్తాయి. అంతరాత్మ హెచ్చరికలను పదేపదే అణచివేయడం మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీసి.. ప్రతికూల వ్యక్తిత్వ లక్షణాలకూ, నిద్రలేమికీ దారితీస్తుంది. అంటే మనసు నిర్మలంగా ఉంటేనే నిద్ర నిష్కల్మషంగా ఉంటుందన్నమాట! నిద్రను ప్రభావితం చేసే మరో కీలకాంశం మనం తీసుకునే ఆహారం. మానసిక ఆరోగ్యం క్షీణిస్తే ఆహారపు అలవాట్లు గాడి తప్పుతాయని, అవి నిద్రనూ ఆరోగ్యాన్నీ తీవ్రంగా ప్రభావితం చేస్తాయని వైద్యపరంగా రుజువైంది. రోజుకు అనేక కప్పుల టీ, కాఫీ, శీతల పానీయాలు సేవించేవారి శరీరంలోకి పెద్ద మొత్తంలో కెఫీన్ చేరి.. వారి నిద్రను హరించివేస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో సరైన ధ్యాన పద్ధతులను క్రమం తప్పకుండా సాధన చేస్తే అద్భుత ఫలితాలుంటాయని నిపుణులు సూచిస్తున్నారు. కాఫీ కప్పుల్లో వెతుక్కునే ఉత్తేజం తాత్కాలికమే.. కంటినిండా నిద్రలో దొరికే శక్తే శాశ్వతం!

ఇక 'ఎన్ని గంటలు నిద్రపోవాలి?' అన్న ప్రశ్నపై ఎప్పటినుంచో చర్చోపచర్చలు సాగుతూనే ఉన్నాయి. వేర్వేరు పరిస్థితులకు వేర్వేరు నిడివుల నిద్ర అవసరమన్నది వైద్యుల సమాధానం. స్వచ్ఛమైన గాలి, మంచి నీరు, పోషకాహారం, తగినంత శారీరక శ్రమ లేదా వ్యాయామం, సానుకూల వాతావరణం.. ఇలా అన్నీ అనుకూలంగా ఉంటే.. శరీరానికి ఎంత అవసరమో అంతసేపు నిద్ర దానంతట అదే పడుతుంది. నిరంతరం ధ్యానస్థితిలో ఉండే యోగుల వంటివారికి నాలుగైదు గంటల నిద్ర చాలు. మరికొందరికి అంతకుమించి అవసరం కావచ్చు. వయసు, సాధారణ శారీరక ఆరోగ్యం, పని దినచర్య, పరిసరాలు, నివాస వాతావరణం.. ఇవన్నీ మనకు అవసరమైన నిద్ర గంటలను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే.. నిద్ర తన ప్రయోజనాన్ని నెరవేర్చుకున్నాక మన చైతన్యం దానంతట అదే తిరిగివస్తుంది. కాబట్టి 'అతినిద్ర' అనేదే ఉండదు! కానీ 'నిద్రలేమి' అనే దురవస్థ మాత్రం కచ్చితంగా ఉంది. ఎందుకంటే ఏదోక కారణంతో.. జీవితంలోని ఇతర సుఖాల వెంట పరుగులు తీస్తూ మనం నిద్రను బలిపెడుతున్నాం. అర్ధరాత్రి దాటినా వదలని సెల్‌ఫోన్ తెరలు, ఓటీటీ వినోదాలు, సామాజిక మాధ్యమాల స్క్రోలింగ్‌లు.. నేటితరం నిద్రను నిలువునా దోచేస్తున్నాయి. 'పెందలకడ నిద్రించి, వేకువనే మేల్కొనేవాడు ఆరోగ్యవంతుడు, ధనవంతుడు, జ్ఞానవంతుడు అవుతాడు' అన్న పెద్దల సూక్తి నేటికాలంలో చెవిటివాడి ముందు శంఖం ఊదిన చందంగా మారింది. చిల్లర కారణాల కోసం నిద్రను పణంగా పెడితే.. తెలిసి తెలిసీ మన ఆరోగ్యాన్ని మనమే కూల్చుకున్నట్టే. కంటినిండా నిద్ర లేకుంటే ఏకాగ్రత సన్నగిల్లుతుంది, జ్ఞాపకశక్తి మందగిస్తుంది, రోగనిరోధక శక్తి క్షీణిస్తుంది, చిరాకు పెరిగి మానవ సంబంధాలూ దెబ్బతింటాయి. అందుకే విజ్ఞత ప్రదర్శించి.. మన ఆరోగ్య ప్రయోజనాల కోసమే నిద్రకు పెద్దపీట వేద్దాం. ప్రతిరోజూ పడక ఎక్కేముందు మనసును ఆలోచనల నుంచి విడిపించి.. నిద్రను ఆహ్వానించే ప్రశాంతతను అలవరచుకుందాం. పగలంతా శ్రమించే శరీరానికి రాత్రి నిద్ర ఇచ్చే బహుమతే.. మరునాటి విజయాలకు పెట్టుబడి. ఆ పెట్టుబడిని నిర్లక్ష్యం చేసినవాడు జీవితంలో నష్టపోక తప్పదు. కాసుల కోసం కునుకును త్యాగం చేసేవారు.. చివరకు ఆ కాసులన్నీ కునుకు కోసమే ఖర్చు చేయాల్సి వస్తుందన్న హెచ్చరికను మరవొద్దు. నిద్రే నిజమైన సిరి.. ఆ సిరిని కాపాడుకున్నవాడే అసలైన ధనవంతుడు! ■

---



**ఇప్పుడిప్పుడే కెరీర్‌లో ముందడుగు వేస్తున్నారా? అయితే, దానికిముందే -మీ గురించి ఓ బలమైన నమ్మకాన్ని, అభిప్రాయాన్ని మీరున్న ప్రపంచానికి చెప్పండి. మీరెలాంటి వారో, ఎలాంటి వారు కాదో మీ చుట్టూవున్న ప్రపంచానికి కచ్చితంగా తెలియాలి. ఆ స్పష్టత ఇవ్వకుంటే.. ఆ ప్రపంచమే మీరెలాంటి వారో దానికి నచ్చినట్టు నిర్వచించేస్తుంది. కాలక్రమేణా ఆ అబద్ధాన్నే నిజమని నమ్మడం మొదలవుతుంది. మీ గురించి మీరు రాసుకోని కథను.. లోకం తన ఇష్టమొచ్చినట్టు రాసేస్తుంది. అదే సమస్య! అందుకే -మీ జీవిత కథకు రచయిత మీరే కావాలి!**

-మహాదేవ

---

### వింతల్లో వింతలు

## 'కంటి'కి కనిపించని కాపీ!



చైనా వర్సిటీ పరీక్షలు అత్యంత కఠినమనేది తెలిసిందే. అందుకే విద్యార్థులు ఇప్పుడు కాపీయింగ్‌కు ఏఐ కళ్లద్దాలు వాడేస్తున్నారట. జులై 1న గ్వాంగ్‌జౌలోని సౌత్ చైనా అగ్రికల్చరల్ యూనివర్సిటీలో లిన్ అనే విద్యార్థి ఇలాగే దొరికిపోయాడు. పరీక్ష మొదలైన పది నిమిషాలకే అతడి కళ్లద్దాల లెన్సుల్లో ఆకుపచ్చ వెల్తురు ఇన్విజిలేటర్ కంటపడింది. అతడు ధరించినవి 'లెకీ స్మార్ట్ గ్లాసెస్' -డీప్‌సీక్ సహా నాలుగు ఏఐ మోడళ్లు ఇమిడిన అద్దాలవి. కణతల వద్ద ఫ్రేమ్‌ను తాకితే చాలు, ప్రశ్నపత్రం ఫొటో తీసి క్షణాల్లో జవాబులు చూపిస్తాయి. ఈ ఉదంతం వైరల్ కాగానే, ఆ ఆకుపచ్చ వెలుగును చౌక స్టిక్కర్లతో దాచొచ్చంటూ నెటిజన్లు 'చిట్కాలు' పంచుకోవడం విశేషం. కేవలం హుబెయ్, హెనాన్, బీజింగ్ వర్సిటీల్లోనూ ఇలాంటి ఘటనలు వెలుగుచూశాయి. భవిష్యత్తులో ఏఐ అద్దాలను సాధారణ కళ్లద్దాల నుంచి వేరు చేసి గుర్తించడమే కష్టమవుతుందని నిపుణులు హెచ్చరిస్తుండటం ఇన్విజిలేటర్లకు పెను సవాలే!

# ఎట్టకేలకు ఒక విజయం

## తొలి వన్డేలో భారత్ గెలుపు
## 6 వికెట్లతో ఇంగ్లండ్ చిత్తు
## రాణించిన గిల్, అక్షర్, సుందర్
## రేపు కార్డిఫ్‌లో రెండో వన్డే



**బర్మింగ్‌హామ్:** ఫార్మాట్ మారింది... ఫలితం మారింది... ఐర్లాండ్--ఇంగ్లండ్ పర్యటనలో ఒక్క గెలుపు కోసం ఎదురు చూస్తున్న భారత అభిమానులకు ఎట్టకేలకు ఊరట దక్కింది. టీ20ల్లో ఆరు పరాజయాల తర్వాత వన్డేల్లో సరైన ఆరంభం లభించింది. ఇంగ్లండ్‌తో మంగళవారం జరిగిన తొలి వన్డేలో భారత్ 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇంగ్లండ్ 47.5 ఓవర్లలో 258 పరుగులకే ఆలౌటైంది. జో రూట్ (76 బంతుల్లో 76 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), లియామ్ డాసన్ (83 బంతుల్లో 68; 6 ఫోర్లు 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు.

ఇంగ్లండ్ 107/6తో ఇబ్బందుల్లో ఉన్న దశలో రూట్, డాసన్ కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు ఏడో వికెట్‌కు 22.2 ఓవర్లలో 121 పరుగులు జోడించారు. అనంతరం భారత్ 45.2 ఓవర్లలో 4 వికెట్లకు 262 పరుగులు చేసి గెలిచింది. కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (75 బంతుల్లో 80 రిటైర్ట్‌హర్ట్; 11 ఫోర్లు, 1 సిక్స్), అక్షర్ పటేల్ (52 బంతుల్లో 57 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్), వాషింగ్టన్ సుందర్ (63 బంతుల్లో 52 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీలు చేశారు. అక్షర్, సుందర్ ఐదో వికెట్‌కు 105 బంతుల్లో అభేద్యంగా 102 పరుగులు జత చేశారు. సిరీస్‌లో భారత్ 1--0తో పైచేయి సాధించగా... కార్డిఫ్‌లో రేపు రెండో వన్డే జరుగుతుంది.

### కీలక భాగస్వామ్యం...

భారత బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేయడంలో ఆరంభంలో స్కోరు చేయడానికి ఇంగ్లండ్ బాగా ఇబ్బంది పడింది. 13వ బంతికి గానీ బెతెల్ (14) తొలి పరుగు తీయలేకపోగా, 7 ఓవర్లలో జట్టు 20 పరుగులే చేసింది. బుమ్రా తన తొలి స్పెల్‌ను 4--0--8--0తో ముగించాడు. ఈ దశలో గుర్నూర్ తొలి ఓవర్లో 2 సిక్సలు, ఫోర్ బాది దూకుడు ప్రదర్శించిన బెన్ డకెట్ (45 బంతుల్లో 43; 6 ఫోర్లు, 2 సిక్సలు) అతని రెండో ఓవర్లో మరో 2 ఫోర్లు కొట్టాడు. అయితే గుర్నూర్ తన తర్వాతి ఓవర్లో ప్రతీకారం తీర్చుకున్నాడు. ఒకే ఓవర్లో అతను బెతెల్, డకెట్‌లను వెనక్కి పంపించాడు. బుమ్రా చక్కటి బంతితో బ్రూక్ (1) పని పట్టగా... ఒకే ఓవర్లో బట్లర్ (5), స్యామ్ కరన్ (0)లను ప్రసిధ్ అవుట్ చేశాడు. 27 బంతుల వ్యవధిలో 19 పరుగులు మాత్రమే చేసి ఇంగ్లండ్ 5 వికెట్లు చేజార్చుకుంది. ఆపై విల్ జాక్స్ (20) కొద్దిసేపు వికెట్ల పతనాన్ని నిలువరించాడు. అతనూ పెవిలియన్ చేరిన తర్వాత రూట్, డాసన్ భాగస్వామ్యంతో జట్టు కోలుకుంది.

7 పరుగుల వద్ద రూట్ ఇచ్చిన సులువైన రిటర్న్ క్యాచ్‌ను దూబే వదిలేయడం ఇంగ్లండ్‌కు కాస్త కలిసొచ్చింది! ఈ క్రమంలో డాసన్ 65 బంతుల్లో వన్డేల్లో తన తొలి అర్ధసెంచరీ సాధించగా, రూట్ 57 బంతుల్లో కెరీర్‌లో 46వ హాఫ్ సెంచరీని పూర్తి చేసుకున్నాడు. శతక భాగస్వామ్యం తర్వాత డాసన్‌ను అవుట్ చేసి అక్షర్ ఈ జోడీని విడదీశాడు. ఆ తర్వాత మరో 30 పరుగులకు ఇంగ్లండ్ చివరి 3 వికెట్లు కోల్పోగా, రూట్ అజేయంగా నిలిచాడు.

### రోహిత్, కోహ్లి విఫలం...

ఛేదనలో భారత్‌కు సరైన ఆరంభం లభించలేదు. తడబడుతూనే ఆడిన రోహిత్ శర్మ (21 బంతుల్లో 11; 1 ఫోర్) భారీ షాట్‌కు ప్రయత్నించి వెనుదిరగ్గా, ఆర్చర్ చక్కటి బంతితో కోహ్లి (5)ని వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. కెపట?టన్ గిల్‌కు మరో ఎండ్ నుంచి శ్రేయస్ అయ్యర్ (35; 2 ఫోర్లు) సహకరించాడు. వీరిద్దరు 101 పరుగులు జత చేశారు. ఈ దశలో తొడ కండరాలు పట్టేయడంతో గిల్ మైదానం వీడగా... మూడు పరుగుల వ్యవధిలో అయ్యర్, రాహుల్ (1) వెనుదిరిగాడు. ఈ దశలో భారత్‌పై కొంత ఒత్తిడి కనిపించింది. అయితే సుందర్, అక్షర్ చక్కటి ప్రదర్శనతో జట్టును గెలుపు దిశగా నడిపించారు. 39 బంతుల్లోనే అక్షర్ నాలుగో అర్ధ సెంచరీ పూర్తయింది. ఆ తర్వాత కూడా ఈ ఇద్దరు ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా గెలుపు ఖాయం చేశారు. రషీద్ బౌలింగ్‌లో భారీ సిక్స్‌తో సుందర్ 63 బంతుల్లో తన రెండో హాఫ్ సెంచరీని చేరుకోవడంతో పాటు మ్యాచ్‌ను ముగించాడు.

### స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: డకెట్ (సి) బుమ్రా (బి) బ్రార్ 43; బెతెల్ (సి) సుందర్ (బి) బ్రార్ 14; రూట్ (నాటౌట్) 76; బ్రూక్ (సి) రోహిత్ (బి) బుమ్రా 1; బట్లర్ (సి) బ్రార్ (బి) ప్రసిధ్ 5; కరన్ (సి) రాహుల్ (బి) ప్రసిధ్ 0; జాక్స్ (సి) రాహుల్ (బి) దూబే 20; డాసన్ (సి) రోహిత్ (బి) అక్షర్ 68; ఆర్చర్ (సి) సుందర్ (బి) అక్షర్ 12; రషీద్ (స్టంప్డ్) రాహుల్ (బి) అక్షర్ 1; టంగ్ (బి) అక్షర్ 0; ఎక్స్‌ట్రాలు 18; మొత్తం (47.5 ఓవర్లలో ఆలౌట్) 258. వికెట్ల పతనం: 1--61, 2--63, 3--64, 4--80, 5--80, 6--107, 7--228, 8--250, 9--258, 10--258. బౌలింగ్: బుమ్రా 9--0--31--1, ప్రసిధ్ 10--2--50--2, గుర్నూర్ బ్రార్ 9--0--61--2, శివమ్ దూబే 6--0--27--1, సుందర్ 4--0--13--0, అక్షర్ పటేల్ 9.5--0--62--4. భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) బ్రూక్ (బి) కరన్ 11; గిల్ (రిటైర్డ్‌హర్ట్) 80; కోహ్లి (ఎల్బీ) (బి) ఆర్చర్ 5; అయ్యర్ (రనౌట్) 35; సుందర్ (నాటౌట్) 52; రాహుల్ (బి) టంగ్ 1; అక్షర్ (నాటౌట్) 57; ఎక్స్‌ట్రాలు 21; మొత్తం (45.2 ఓవర్లలో 4 వికెట్లకు) 262. వికెట్ల పతనం: 1--43, 2--48, 3--157, 4--160.బౌలింగ్: ఆర్చర్ 10--0--60--1, టంగ్ 10--0--50--1, స్యామ్ కరన్ 10--0--55--1, రషీద్ 5.2--0--34--0, బెతెల్ 1--0--10--0, డాసన్ 2--0--10--0, జాక్స్ 7--0--43--0.

## స్పోర్ట్స్

## అర్జెంటీనాకు ఇంగ్లండ్ సవాల్..
## నేడు ఇంగ్లిష్ టీమ్‌తో
## మెస్సీసేన సెమీస్ పోరు

**అర్ధరాత్రి 12.30 నుంచి యునైటెడ్8 స్పోర్ట్స్, జీ5లో లైవ్**



**అట్లాంటా :** ఫిఫా ప్రపంచకప్‌లో వరుసగా రెండోసారి విజేతగా నిలవాలని ఆశిస్తున్న లియోనల్ మెస్సీ కెప్టెన్సీలోని అర్జెంటీనా అతి పెద్ద సవాల్‌ను ఎదుర్కోనుంది. బుధవారం అర్ధ రాత్రి జరిగే రెండో సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంప్ అర్జెంటీనా..బలమైన ఇంగ్లండ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది. సాకర్ సామ్రాజ్యంలో సుదీర్ఘ చరిత్ర కలిగిన ఈ రెండు జట్లు వరల్డ్‌కప్‌లో 21 ఏండ్ల తర్వాత మళ్లీ ముఖాముఖి తలపడుతుండటంతో ఈ మ్యాచ్‌పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ టోర్నీలో ఇంగ్లండ్ ఇప్పటివరకు ఓటమి ఎరుగకుండా దూసుకుపోతోంది. నాకౌట్ దశలో కాంగో, సహ ఆతిథ్య జట్టు మెక్సికో, నార్వేపై విజయాలు సాధించి సెమీస్‌లో అడుగుపెట్టింది.

ఆ జట్టు కెప్టెన్ హ్యారీ కేన్ ఆరు గోల్స్ సాధించగా, మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హామ్ కూడా ఆరు గోల్స్, ఒక అసిస్ట్‌తో సూపర్ ఫామ్‌లో ఉన్నారు. మరోవైపు, డిఫెండింగ్ చాంప్ అర్జెంటీనా ప్రతి మ్యాచ్‌లోనూ తీవ్రంగా శ్రమించి సెమీస్‌కు వచ్చింది. గ్రూప్-జె లో అగ్రస్థానంలో నిలిచిన ఆ జట్టు.. నాకౌట్ రౌండ్లలో కాబో వెర్డె, ఈజిప్ట్‌ను ఓడించేందుకు చెమటోడ్చింది. క్వార్టర్ ఫైనల్లో స్విట్జర్లాండ్‌పై ఎక్స్‌ట్రా టైమ్‌లో 3-1తో విజయం సాధించింది. అర్జెంటీనాను కెప్టెన్ లియోనల్ మెస్సీ ముందుండి నడిపిస్తున్నాడు. ప్రపంచకప్ చరిత్రలోనే అత్యధిక గోల్స్ చేసిన మెస్సీ.. ఈ టోర్నీలో ఇప్పటివరకు 8 గోల్స్, రెండు అసిస్ట్‌లు సాధించాడు. ఇక, ముఖాముఖిలో అర్జెంటీనాపై ఇంగ్లండ్‌దే పైచేయి కావడం మెస్సీ అభిమానులను కాస్త ఆందోళనపరిచే విషయం. ఇరు జట్ల మధ్య ఇప్పటివరకు 14 మ్యాచ్‌లు జరగ్గా.. ఇంగ్లండ్ ఆరుసార్లు నెగ్గితే.. అర్జెంటీనా 3 మ్యాచ్‌ల్లోనే విజయం సాధించింది.మరి, ఈసారి ఎవరిది పైచేయి అవుతుందో చూడాలి.


# ఆ రెండు భాగాలను మించిన కష్టంతో రాజమౌళి!

భారతీయ చలనచిత్ర చరిత్రను మలుపు తిప్పిన దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తాజాగా మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కోసం -వారణాసి- వేదికగా తన మేకింగ్ మ్యాజిక్‌ను ప్రదర్శించడానికి సిద్ధమవుతున్నారు. -బాహుబలి- వంటి భారీ చిత్రాల కోసం ఎంతగా శ్రమించారో? అంతకు మించిన కష్టాన్ని వారణాసి షూటింగ్ కోసం పడుతున్నారని తెలుస్తోంది. సాధారణంగా రాజమౌళి సినిమాలు అనగానే భారీ సెట్లు, వందల కోట్ల బడ్జెట్ గుర్తుకొస్తాయి. కానీ -వారణాసి-లో జరుగుతున్న షూటింగ్ అందుకు భిన్నంగా, సహజసిద్ధమైన లొకేషన్లలో అత్యంత క్లిష్టమైన సవాళ్లతో సాగుతోంది. అవసరం మేర వారణాసి సెట్లు వేసి కొంత షూటింగ్ చేసినా? రియల్ లొకేషన్స్ లో చేసిన సీన్స్ వేరే లెవల్లో ఉంటాయి.



ఆధునిక సౌందర్య ప్రమాణాలకు శ్రీనిధి శెట్టి కొత్త నిర్వచనం

-వారణాసి-లోని గంగా తీరం, పురాతన కట్టడాలు , జనసమ్మర్ధం ఎక్కువగా ఉండే వీధుల్లో షూటింగ్ చేయడం ఏ దర్శకుడికైనా పెద్ద పరీక్ష. భారీ సెట్లు నిర్మించే అవకాశం లేని ప్రాంతంలో ఉన్న వాతావరణాన్ని కథకు తగ్గట్టుగా మలచుకోవడం రాజమౌళికి పెద్ద సవాలుగా మారింది.



-బాహుబలి-లో సాంకేతిక పరిజ్ఞానంతో దృశ్యాలను సృష్టిం చడం ఒక ఎత్తు అయితే? ప్రకృతిని , సహజ సౌందర్యాన్ని కథాంశంతో మేళవించడం మరో ఎత్తు. అందుకే ఈ చిత్రం కోసం ఆయన ఎంతో శ్రద్ధతో ప్రణాళికలు రచిస్తున్నారు. వాస్తవానికి వారణాసిలో షూటింగ్ చేయడం అంటే సాంకేతికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కోవడమే. పరిమితమైన స్థలంలో భారీ కెమెరా సెటప్‌లను అమర్చడం, వెలుతురును కంట్రోల్ చేయడం, పర్యాటకుల రద్దీని తట్టుకుని షూటింగ్ జరపడం వంటివి సాధారణ విషయం కాదు. కానీ రాజమౌళి పట్టుదలతో ఈ సవాళ్లను అధిగమిస్తున్నారు. ఒక్కో సన్నివేశాన్ని ఆశించిన స్థాయిలో చిత్రీకరించడానికి ఆయన పడుతున్న తపన, కెరీర్‌లో ఇప్పటివరకు చూడని డెడికేషన్ కు నిదర్శనమని యూనిట్ సభ్యులు చెబుతున్నారు.

ఈ ప్రాజెక్ట్ కోసం రాజమౌళి అనుసరిస్తున్న మేకింగ్ శైలి పూర్తిగా భిన్నంగా ఉందని సమాచారం. -బాహుబలి- లాంటి పీరియాడిక్ డ్రామాలో సెట్లు ప్రాణం పోస్తే ఈ చిత్రంలో వారణాసి నగరమే ఒక పాత్రలా కనిపిస్తుందిట. నగరంలోని వైబ్రేషన్స్‌ను, ఆధ్యాత్మికతను ప్రతిబింబించేలా ప్రతి ఫ్రేమ్‌ను రాజమౌళి తీర్చిదిద్దుతున్నారు. భారీ గ్రాఫిక్స్ పైన కాకుండా సహజత్వాన్ని పండించే అంశాలపైనే రాజమౌళి ఎక్కువ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇది రాజమౌళిలోని వైవిధ్యమైన దర్శకుడిని మరోసారి ప్రపంచానికి పరిచయం చేస్తుంది.-బాహుబలి- విజయం తర్వాత రాజమౌళి చేసే ఏ సినిమా అయినా సరే ఆ అంచనాలను అందుకోవాల్సిందే. అందుకే రాజమౌళి ఏ చిన్న విషయాన్ని కూడా వదిలిపెట్టకుండా పని చేస్తున్నారు. వారణాసిలో రాజమౌళి పడుతున్న కష్టం, థియేటర్లలో ప్రేక్షకులకు ఓ సరికొత్త దృశ్య కావ్యాన్ని పరిచయం చేస్తుందని నమ్మకం కలుగుతోంది. మేకింగ్ పరంగా ఎదురవుతున్న ఇబ్బందులను కూడా రాజమౌళి ఆనందంగా భరిస్తున్నారు అంటే, సినిమా ఫలితం ఏ రేంజ్ లో ఉండబోతుందో ఊహించుకోవచ్చు. బ్లాక్ ఫారెస్ట్ లాంటి కఠినమైన లొకేషన్లలో షూటింగ్ అంతకు రెండితలు కష్టపడాల్సి ఉంటుంది. ఇక్కడ ఇంకా సవాళ్లు ఎదురవుతాయన్నది అంతే వాస్తవం.



ప్రణితా సుభాష్ తాజా ఫొటోషూట్ అందరినీ ఆకట్టుకుంటోంది

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com